

ಅಭ್ಯುದಯ

అభ్యుదయ ప్రచురణ

అభ్యుదయ కథలు

[మొదటి సంపుటి]

రచయితలు : శ్రీ కొడవటిగంటి కుటుంబరావు,
అడివి బాపిరాజు, తెన్నేటి సూరి మొదలైనవారు

వెల: రూపాయి

త్వరలో వెలువడుతుంది

ఏజెంట్లు ప్రతులకు వ్రాయండి

మేనేజరు : అభ్యుదయ : బెజవాడ

"కళ ప్రజలచేతి ఉత్తమాయుధం"

ఇదే అభ్యుదయ సందేశం

వీర తెలంగాణా స్వాతంత్ర్య సమరానికి
అభ్యుదయ రచయితల కానుక

అభ్యుదయ

మేనెలలో ప్రత్యేక సంచికగా వెలువడుతుంది!

తెలంగాణా పోరాటాన్ని చిత్రించే

... కథలు, వ్యాసాలు, నాటికలు, గీతాలు ...

శ్రీశ్రీ, కొడవటిగంటి, 'ప్రవాసి', ప్రయాగ, అనిశెట్టి,
సుంకర, సూరి, శివయ్య, తుమ్మల, రామమోహన్
మొదలైన వారి ఉత్తమ రచనలు

రాం గోపాల్, మా. గోఖలే, శంకర్
మొదలైన వారి ఉత్తమ చిత్రాలు

వెల: రూపాయి

ప్రతులకు

మేనేజరు : అభ్యుదయ : బెజవాడ

అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

సంపుటి 2	1948 ఏప్రిల్	సంచిక 5

సంపాదకులు

కొమర్రాజు వినాయకరావు

ప్రయాగ కోదండరామశాస్త్రి

★

శ్రీ వీరేశలింగ శతవార్షికోత్సవ సంచిక

వెల ఆరణాలు

ఇందులో

ముఖచిత్రం : శ్రీ వీరేశలింగం

రచన : మా. గోఖలే

Editor, Printer & Publisher K. Vinayaka Rao
Secretary, Andhra Progressive Writers' Association, Governorpet.
Printed at Abhyudaya Press, Vijayawada.

సంపుట 2 సంచిక 5

అభ్యుదయ

ఏప్రిల్ 1948

ఆంధ్రాభ్యుదయ రచయితల మాసపత్రిక

వీరేశలింగ శతవార్షిక జన్మదినోత్సవం

ఆంధ్ర వైజ్ఞానిక, సంస్కరణోద్యమాలకు మూలపురుషులైన శ్రీవీరేశలింగంగారి శతవార్షిక జన్మదినోత్సవం రేపు ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో ఆంధ్రదేశమంతటా - ప్రతిపట్నంలోను, పల్లెలోను, - దిగ్విజయంగా జరపమని అభ్యుదయ రచయితలనూ, అభ్యుదయాభిలాషులనూ కోరుతున్నాం.

శ్రీ వీరేశలింగం గారి సంస్కరణా, సాహిత్యోద్యమాల ఔన్నత్యాన్ని గుర్తెరిగి ఆయన ఉద్యమ ప్రాబల్యంకోసం మొట్టమొదటి సారిగా కృషిప్రారంభించిన సంస్థ అభ్యుదయ రచయితలసంఘం. ఆంధ్రదేశం నలుమూలలకూ ఆయన సందేశాన్ని విన్పించటానికి, ఆయన నిర్మించిన సత్సంప్రదాయాల ననుసరించి ప్రజాసామాన్యంలో జాగృతి కల్గించటానికి ప్రతియేటా వర్థంతి సభ లేర్పరుస్తూ, ప్రత్యేక సంచికలు ప్రకటిస్తూ ఆయన ఆదర్శాల నాచరించుటలో మనసంఘం అగ్రగామిగా నిలిచింది. ఈవిధంగా పలుసంస్థలు జరిపిన తీవ్రకృషియే నేడు ఆంధ్ర ప్రజలంతా బ్రహ్మాండమైన ఉత్సాహంతో ఆయన శతవార్షిక జన్మదినోత్సవాన్ని జరుపుటకు ప్రాతిపదిక నిర్మించింది. ఆంధ్ర అభ్యుదయ రచయితలసంఘ స్థానిక శాఖలన్నీ ఈ సమయంలో సభలు, ప్రదర్శనాలు జరిపి ఆయన స్మృతికి నివాళులర్పించ వలసినదిగా ఆదేశిస్తున్నాం

గీతాంజలి

శ్రీ పుష్పకుమారి

✶

భావి నెరుగని చిరుత
ప్రాయాన బాలికకు
తాళిగట్టుట - ఆర్య
ధర్మమంటూ పలికి
గొంతు కోసే శాస్త్ర
కోటిపై దండెత్తి
పంతమును గెల్పించినావు!
వీరేశ!
భ్రాంతినే రూపుమాపావు!

౨

ముసలివానికి వయసు
కన్నెలను ముడిపెట్టి
అతడు కనుమూయగనె
బొట్టుకాటుక చెరుపు
మూఢసంఘ మొనర్చు
దుర్మార్గములనెల్ల
కచ్చతో నెదిరించినావు!
వీరేశ!
ఘనవిజయమును గాంచినావు!

3

నీ ప్రహసనాలలో
నిలిచిపోయినశక్తి
సంఘద్రోహుల గుండె
ఖడ్గమై చీల్చినది,
కాంతియై ప్రజకు
కర్తవ్యమును జూపినది
పరివర్తనము తెచ్చెనయ్యా
వీరేశ!
ప్రగతినే చూపించెనయ్యా!

౪

ఆంధ్రావనికి నీదు
అండయే లేనిచో
ఆంధ్రకవితకు నీదు
ఆదరమె లేనిచో
నేటికీ వెతలన్ని
దాట లేమేమో!
నేటికీ వెలుగులో
నిలువ లేమేమో!
నేటి శతవార్షికోత్సవ
సమయ మందునీ
స్మృతికి మాగీతాంజలి
వీరేశ!
అందుకో ఆశీర్వదించు!

స్మృతి

శ్రీ 'రాంషా'

1

ఓహో, ఓ బాటసారి !
వింటావా ? చిన్నకథను !!
కలలకథ యొకింతకాదు ;
నిజజీవిత జన్యగాథ.
సాధారణ వగగాథల
నేనసలే చెప్పబోను ;
ఓ హోహో బాటసారి !!
ఘనుడేమన కందుకూరి !!!

2

సాటిలేని ప్రతిభ కలిగి,
అసమానుడ వీవైతే–
అదృష్ట ద్వారబంధముకడ
వెలిపొందిన ఓ మనిషీ !
ఇటుబరపుము సానుభూతి–
నీవాడే కందుకూరి !

3

తేనెలొలుకు కిన్నెరతో
పాటలల్లు కవివైతే,
అభ్యుదయం, సంస్కారం
వాంఛించే కవివైతే,
ఈ సమాధి సమీపాన
నడయాడే బాటసారి !
గుండెవిప్పి తొంగిచూడు
స్థిరుడయ్యా కందుకూరి !!

4

తనరచనా పటిమతోడ
ఏ సంఘంబాగు పడెనో
తన సంస్కృతి వచనతోడ
ఏదేశం జ్వలియించెనో
ఆదేశం, ఆసంఘం, ఋణంపడిన
నిజపురుషుడు కందుకూరి!

5

నరులపైన రచనపైన
శ్రేయమార్గ వర్తనాన
ఏకాంతిని బరపుతావో,
ఏ తీరున చూస్తావో,
ఆకాంతికి, ఆతీరుకు
తగినవాడు, ఉత్కృష్టుడు
ఉజ్జ్వలుడో కందుకూరి!

6

స్నేహనీయ ఔచిత్యం
ఎవని యందు వెలిగిందో
అట్టిజీవి తలపోతమొ,
జాలికంటి నీటికణం
రాలదగిన సమయస్మృతి-
ఘనుడయ్యా కందుకూరి !

ఉగాది

శ్రీ అ. నరసింహశర్మ

హుతవహపరీత గృహాల్లోంచి
శిశువుల ఆక్రందనం శ్రుతిచేస్తూ
వికటాట్టహాసంతో
నిజాం ప్రభువు ఉద్ధత నృత్యం!

సామ్రాజ్యవాదులు
మతాలు జోడించి
తాళం వేస్తూ వుంటే
ప్రజల ఆర్తనాదం
సంగీతంలా
వినిపిస్తుందా రజ్వీకి?

చదరంగపు ఆటలో
పోటీపడి మైమరచిన
ఈ 'స్వతంత్ర' ప్రభువుకు
ఆశబ్దం వినిపించదు!
ఆశబ్దం కాలిన ఊళ్లది,
కూలిన కాపురాలది,
పేలిన కళ్లల్లోంచి
పుట్టిందా శబ్దం!

ఒకఇల్లూ ఒకప్రాణీ
అలా శబ్దిస్తాయా?
ఆకాశంవిరిగిన శబ్దం!
భూమేపగిలిన శబ్దం!

ఇంత ఋవే బద్దలైతే
అంత నాశనం కలుగుతుందే
ప్రజల ప్రాణాణువులు,
శ్రామిక శ్రమబిందువులు,
కర్షక రక్తాణువులు,
ఒకటేమిటి!
పీడితలోక ప్రాణాణువు
లెన్నెన్నో
ఒక్కసారి పగిలాయివిగో!

ఓ నైజాం ప్రభువా!
దీనిముందు నిలువలేవు
దీని కెదురు నడువలేవు
సర్వజిత్తు రక్తాక్షి రక్తకాళి
భూమంతా దానినాలుక,
నిన్నూ నీవాళ్ళని
నిన్నూ నీ తత్వాన్ని
నిముసంలో మింగుతుంది!

హతులైన ప్రజలంతా
నీ మీదనె
శవతాండవం చేస్తారు!

పీడిత పాలితలోకం
కదిలిందాక రౌద్రంతో

బెదురులేని గుండెలతో
చెదరిపోని పంక్తులతో
భుజంభుజం కలుపుకొంటు
కదలిందొక రౌద్రంతో!

మతదుర్గాల్నిర్మించిన
సమ్రాట్టుల కోటలన్ని
కలియకట్టి త్రోయండటు!
నైజా మొక్కడుకాదు
ఒక్కడుకాదు నిజాము!

కోటలన్ని కూలద్రోసి
పాదులతో పెరికివేసి
కర్షకులే దున్నిదున్ని
సస్యాలతో నింపినింపి
అభ్యుదయం స్వాతంత్ర్యం
సమభావం సౌహార్ద్రం
పండించే సర్వధారి!
వెనుదీయక నడవండటు
నడవండిక ! నడవండిక!

★

" ఏదియైన వింతసంగతి విన్నచో శోధించి దాని నిజమును గనుగొనవలెననియు విన్నదాని నెల్ల విశ్వసింపగూడదనియు, విశ్వసించినదాని ననుసరించి ప్రవర్తింపవలెననియు, నాకు మొదటినుండియు నైసర్గికాభిరతియైయుండెను; గాని యాలోచన లేక యొరులు చెప్పినట్లెల్లను నడుచు స్వభావ మెప్పుడును లేదు"

—శ్రీ వీరేశలింగం

శపథం

శ్రీ రామకవచం
సత్యనారాయణ

కదిలిందది తెలంగాణ!
కదిలిందిది ప్రజాబలం!
హృదిలోపల రగులుతున్న
విప్లవాగ్ని జ్వాలలతో,
ఎదపై మండెడు కుంపటి
మదమెక్కిన నైజామును
తుదముట్టించుట కొరకై
గదిమి గదిమి తరుముటకై
గద్దెనుండి దింపుటకై
కదిలిందది తెలంగాణ!
కదిలిందది ప్రజాబలం!

కోటి తెలంగాణ యోధ
పటాలమే లేచిందోయ్
కోటి తెలుగు గొంతులొక్క
పాటున నేపలికినవోయ్
"అంతిమవిజయం మాదే
అంతవరకు శాంతించం"
చింతనిప్పులాంటి కనుల
కాంతులెల్ల గ్రమ్ముకొనగ
గొంతెత్తెను కోటిజనం
శాంతిలేని తెలంగాణ!
శాంతించని తెలంగాణ!
"ముక్కోటాంధ్రుల మున్నాం
చిక్కము నీకో నైజాం!
ఒక్క గుండెలన్ని కలిసి
ఒక్కటిగా కూడినవోయ్
ప్రజా బలాన్నెదిరించీ
ప్రజలశక్తి ప్రతిఘటించి
పాలింపగ నీవేమో
పగటికలలు గంటున్నావ్!
నీ పాలన సాగదోయి
నీకలలు ఫలించవోయి
చావూ బ్రతుకుల మధ్యన
సాగే మా పోరాటం
నీ అంతము కండ్లజూచు
నంతవరకు శాంతించదు!"

ఇది ప్రతిజ్ఞ ఇది శపథం
వదలం మా బిగి పిడికిలి.

★ ★ ★

ఆంధ్ర జాతీయ పునర్వికాసానికి

యుగపురుషుడు వీరేశలింగం

శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు

"వీరేశలింగంగారు నవీనాంధ్రదేశమునకును, ఆంధ్ర వాఙ్మయమునకును యుగపురుషుడు. పండిత పామరులకు హృదయరంజకమగు సులభవచన శైలిని నిర్మించి, ఏతన్మూలమున విద్యాసౌరభము, సంఘసంస్కరణాభిరతిని ఆంధ్రావనిని వెదజల్లిరి."

—రాయసం వెంకటశివుడు

బాల్యం

కందుకూరి వీరేశలింగం పంతులుగారు 1848 వ సంవత్సరం – ఏప్రిల్ 16 వ తేదీన రాజమహేంద్రవరంలో జన్మించారు. నాలుగేండ్ల వయస్సులోనే ఆయన తండ్రి చనిపోయాడు. అందుచేత వీరేశలింగాన్ని తల్లి, పెదతండ్రి గారాబంగా పెంచారు.

చదువుకొనే కాలంలోనే వీరేశలింగంలో తెలివితేటలు, ప్రతిభ కనిపించసాగాయి. ఏ పాఠమైనాసరే ఒకసారి చదివినంతనే అప్పజెప్పగలిగేవాడు. బాలుని మేధాశక్తి ఉపాధ్యాయులను, విద్యార్థులనుకూడ ఆకర్షించాయి.

వీరేశలింగం నాల్గవ తరగతి చదువుచుండగా ఒకసారి జిల్లాజడ్జీ పాఠశాలను చూడటానికి వచ్చాడు. బడిలోని పిల్లలందరికీ చీటీలనిచ్చి, 'సత్ప్రవర్తనగల విద్యార్థి' పేరు వ్రాయమని కోరాడు. ఎక్కువమంది బాలురు వీరేశలింగం పేరే వ్రాశారు. జడ్జీచే 10 రూ. విలువగల పుస్తకాలను వీరేశలింగం బహుమతిగా పొందాడు. ఈ సంఘటన వీరేశలింగమును తోడి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎలా మెచ్చుకొనేవారో తెలుపుతుంది.

విద్యార్థినాయకుడు

వీరేశలింగం మెట్రిక్యులేషన్ పరీక్షకు చదువుతున్నాడు. ప్రధానోపాధ్యాయుడుగా వైయాపురి మొదలియార్ వుండేవాడు. ఆయనకు ఇంగ్లీషు పద్యకావ్యం బోధించగల శక్తి లేదు. విద్యార్థుల లాభం నిమిత్తం యింకో సమర్థుని నియమించాలని వీరేశలింగం ఆందోళన చేయసాగాడు.

విద్యాధికారులకు యీ విషయమై ఒక పిటీషను వ్రాసి, తన క్లాసులోని బాలురందరిచేత సంతకాలు చేయించాడు. తక్కిన తరగతులలోని విద్యార్థుల సంతకాలకొరకు మిత్రుని చేతికిచ్చి పంపాడు. ఈ సంగతి హెడ్మాష్టరుకు తెలిసింది.

తన ఏజెంట్లును పంపి మోసంద్వారా పిటీషను కాజేశాడు.

వీరేశలింగం యింతటితో నిరుత్సాహ పడలేదు. మరల పిటీషనువ్రాసి పంపే ప్రయత్నంలో ఉన్నాడు.

మర్నాడు హెడ్‌మాస్టరు క్లాసులోకి వెళ్ళి, వీరేశలింగం మిత్రుని పిటీషనుపెట్టి నందుకు గొడ్డును బాదినట్లు కొట్టాడు. వీరేశలింగమున్న క్లాసుకు వచ్చాడు.

తెలివితేటలుకలవాడవుటచే వీరేశలింగం యెడల అదివరకు హెడ్‌మాష్టరు ప్రేమాభిమానాలు చూపేవాడు. కాని అతడే తనపై పిటీషనుకు కారకుడని తెలిసి మండిపడ్డాడు. "బుద్ధిహీనుడా! ఫూల్!" అని తిట్టాడు.

వీరేశలింగం ఈఅవమానాన్ని సహించలేదు. వెంటనే క్లాసును వదలి బయటికి వచ్చాడు. అతనితోపాటు విద్యార్థులందరూ బయటికి వచ్చారు.

విద్యార్థులసమ్మె - విజయం

సమ్మె ప్రారంభమయింది. ఆ హెడ్‌మాష్టరును తొలగించితే గాని బడికిపోమని విద్యార్థులు కట్టుకట్టారు.

పిటీషనుపై సంతకాలు చేయించి, వీరేశలింగం విద్యాశాఖకు పంపాడు. టెలిగ్రాములు పంపించాడు.

సమ్మెలో పాల్గొనే విద్యార్థులను డిస్‌మిస్ చేస్తానని హెడ్‌మాష్టరు బెదిరించాడు. విద్యార్థులు జంకలేదు. తరువాత హెడ్‌మాష్టరు తానే భయపడ్డాడు. క్షమించి వదలుతాననీ, బహుమానాలిస్తానని, స్కూలుకు రమ్మని లాలించసాగాడు. కాని విద్యార్థులు పట్టు వీడలేదు.

ప్రభుత్వం విచారణ చేసింది. హెడ్‌మాష్టరును బదిలీ చేసింది. ఈ విధంగా వీరేశలింగం నడిపిన విద్యార్థి పోరాటం జయించింది.

వీరేశలింగం క్లాసులో మొదటివాడుగా వుండేవాడు. ప్రథమ బహుమానాలన్నీ అతనివే. 1870 డిశంబరులో మెట్రిక్యులేషన్ ప్యాసయ్యాడు. అప్పటికి రాజమండ్రిలో కళాశాల లేదు. ఉన్నతవిద్యకు అవకాశం లేదు.

ఆదర్శఉపాధ్యాయుడు

1871 లో పంతులుగారు రాజమండ్రి ప్రభుత్వపాఠశాలలో రు 25_ జీతంపై తాత్కాలిక ఉపాధ్యాయుడుగా చేరారు, మరుసటి ఏడాది ధవళేశ్వరంపాఠశాలలో చేరారు.

ఈకాలంలోనే వీరు మూఢాచారాలను ఎదిరించుతూ వ్యాసాలు రాయడం ఆరంభించారు. బాలికలకు విద్యావశ్యకతను గురించి చర్చలు జరుపుతుండేవారు. మిత్రులతో కలసి చందాలువేసికొని 1874 ధవళేశ్వరంలో బాలికాపాఠశాలను స్థాపించారు.

1876 లో "వివేకవర్ధని" అను పక్షపత్రికను స్థాపించారు. దానికిఅనుబంధంగా 'హాస్యసంజీవని' అను మాసపత్రికనుకూడ నడుపసాగారు. వాటి నిర్వహణకు రాజమండ్రిలోనుండుట అవసరమయింది. అందుచే ధవళేశ్వరంలో ఉపాధ్యాయపదవి వదలుకున్నారు. రాజమండ్రి ప్రభుత్వపాఠ

శాలలో రు25/- జీతంపై రెండవ తెలుగు పండితులుగా చేరారు.

పంతులుగారు ఉపాధ్యాయులుగా పనిచేసినంతకాలం విద్యార్థులను ఆకర్షించారు. పాఠ్యపుస్తకాలకు మాత్రమే ఆయన బడిపంతులుగాదు. విజ్ఞానం వెల్లివిరియుటకు ఆదర్శంగా పెట్టుకొన్న ఉపాధ్యాయుడు. ఆయనకృషి చదువుకొనే విద్యార్థులను ఎంతో ఉత్తేజితులను చేసేది. విద్యార్థులు విజ్ఞానం సంపాదించుటకు పాటుబడేవారు.

పంతులుగారు నడుపుతున్న 'వివేకవర్ధని' 'హాస్యసంజీవిని' పత్రికలను విద్యార్థులు ఆతురతతో చదివేవారు. పంతులుగారు నాయకత్వంవహించి నడుపుతున్న సంఘసంస్కారోద్యమానికి విద్యార్థిబృందమంతా అండగా నిలచేది.

పంతులుగారు సేనాని ! విద్యార్థులు సైన్యం !!

బాల్యవివాహాలు, వృద్ధులకు కన్యలను అమ్మటం వగైరా మూఢాచారాలను పంతులుగారు ఖండించేవారు. వితంతువివాహాలు శాస్త్రసమ్మతమని నిరూపించేవారు. ఇందుకు పూర్వాచారపరాయణులగు ఛాందసులు మండిపడేవారు. శంకరాచార్యులు వగైరా పీఠాధిపతులు ఆంక్షలు విధించారు. కక్ష బూనారు.

అట్టి మూర్ఖులకు విద్యార్థిసైన్యం బుద్ధిగరపేది. పంతులుగారి కెపుడూ అంగరక్షకులై కాపాడేవారు. పంతులుగారు చేయించిన వితంతుబాలికల పునర్వివాహాలకు, పూరేగింపులకు విద్యార్థులు రక్షణ యిచ్చేవారు

ఉపాధ్యాయుల - విద్యార్థుల మధ్య సన్నిహిత సంబంధమంటే యిలావుండాలి! పంతులుగారు విద్యార్థులకు బడిపంతులే గాక నాయకుడు, ఆదర్శప్రాయుడు. రాజమండ్రిలోనూ, మద్రాసులోనూ యిదే విధంగా విద్యార్థుల మన్నన పొందారు.

పంతులుగారు ఆధునిక పద్ధతిలో బాలురకు వాచకపుస్తకాలు వ్రాశారు. అవే చాలకాలంవరకు బాలురకు పాఠ్యపుస్తకాలుగా వుండేవి. తమ చివరిదశలో కృషిచేసి పంతులుగారు రాజమండ్రిలో హైస్కూలు నిర్మించారు. ఇదే యిపుడు వీరేశలింగం హైస్కూలు అని పిలువబడుతూంది. తద్వారా పంతులుగారి పేరు ఉపాధ్యాయుడుగా చిరస్మరణీయ మయింది.

సంఘ సంస్కర్త

ఆరోజులలో దెయ్యాలు, భూతాలు వుంటాయనే పిచ్చినమ్మకాలు ఎక్కువగా వుండేవి. పంతులుగారు యీ మూఢనమ్మకాలను నిర్మూలించడానికి కృషిచేశారు.

పంతులుగారి దొడ్లో అరటిచెట్టు తప్పుడు గెల వేసింది: అనగా ఈశాన్య దిక్కుకు వేయలేదు. ఆచారం ప్రకారం ఆ చెట్టును కొట్టివేయాలని బంధువులంతా సలహా యిచ్చారు. అది మూఢవిశ్వాసం మాత్రమేనని పంతులుగారు ఆ సలహాను తోసిపుచ్చారు.

ఇంట్లో దూలానికి తేనెతుట్టె పట్టింది. ఇంటిని వదిలివేయనైనా వేయాలి, లేదా బ్రాహ్మణుల పిలిపించి 'శాంతి' చేయించాలని ఛాందసులు పట్టుబట్టారు పంతులు

గాదు ఏమీ లెఖ్ఖచేయలేదు. ఈలాంటి ఆచారాలను అవలంబించకపోవటంవల్ల ఏమీ ప్రమాదాలు జరుగవని ప్రజలు క్రమంగా తెలుసుకోసాగారు.

జ్యోతిశ్శాస్త్రంమీద, శకునాలమీద మూఢనమ్మకాలుండటం, అంటువ్యాధులు వ్యాపించినపుడు ఆరోగ్యసూత్రాలను పాటించడానికి బదులు జంతుబలి యివ్వటం వగైరా మూఢాచారాలనుకూడా పంతులుగారు ఖండించారు. పత్రికలలో వ్యాసాలద్వారానూ, ప్రహసనాలద్వారాను వీటిలోని కుళ్ళును బట్టబయలుచేసి పంతులుగారు ప్రజలలో జ్ఞానోదయం కలిగించడానికి కృషిచేశారు.

లంచగొండుల శత్రువు

ఆ రోజులలో ఉద్యోగస్థులలోనూ, పెద్దమనుష్యులని చెప్పుకొను వారిలోనూ వేశ్యాలోలత్వం విపరీతంగా వుండేది. ఊరేగింపులలో భోగంమేళం లేనిదే మజా లేదనేవారు. ఉన్నతోద్యోగులు భోగంమేళాలతో మేజువాణీలు జరిపి క్రింది తాబేదారులను తమతో పనివున్నవారందరినీ ఆహ్వానించేవారు. వారంతా హాజరయి కట్నాలు, ముడుపులు చెల్లించుకోవాలి.

ఇది దురాచారమే గాక, కట్నాలిచ్చుకోలేక తాబేదారులకు ప్రాణసంకటమయ్యేది. పంతులుగారు యిట్టి సభల గుట్టును బట్టబయలు చేస్తూ పత్రికలలో వ్యాసాలు వ్రాసేవారు. తమ ఉపన్యాసాలలో తీవ్రంగా ఖండించేవారు. ఆ దురాచారాన్ని ప్రజలంతా అసహ్యించుకొనునట్లు చేశారు

ప్రభుత్వ కోర్టులలో, మ్యునిసిపాలిటీలలో వ్యాపించిన దారుణమైన లంచగొండితనం పైన పంతులుగారు ప్రహసనాలు, నాటకాలు రచించారు. 'జవాబంది' 'మ్యునిసిపల్ నాటకం' 'వ్యవహారధర్మబోధిని' వగైరా ఇలాంటివే! లంచాలు పుచ్చుకునే వుద్యోగులను పత్రికలలో దువ్వార బట్టేవాడు.

ఈ సందర్భాలలో పంతులుగారిపై అధికారులు కేసులుపెట్టి కోర్టులకు యీడ్చారు. వాటన్నిటిలోనూ ఎదుటివారి దోషాలను రుజువుచేసి, తమ ఆరోపణలు సత్యమైనవని నిరూపించేవారు. కొందరు లంచగొండుల వుద్యోగాలు వూడాయి. కాని, ప్రభుత్వ విధానమే లంచాల పుట్ట అయినందున పంతులుగారికికూడా జరిమానా శిక్షలు కొన్నిటిలో తప్పలేదు.

కులవిభేదాలు గిట్టవు

మతభేదాలు, వర్ణద్వేషాలు దేశాభివృద్ధికి జాతీయాభివృద్ధికి వేరుపురుగులాంటివని చాటినవారిలో వీరేశలింగంగారు ప్రప్రథములు. మొట్టమొదటిసారి ఆంధ్రదేశంలో వివిధకులాలు మతాలకు చెందినవారితో సహపంక్తి భోజనాలుచేశారు.

మాలమాదిగలపట్ల అగ్రవర్ణాలనబడేవారి అమానుషప్రవర్తనలను పంతులుగారు తీవ్రంగాఖండించారు. ఇంతటితో ఆగక మొట్టమొదటిసారి తమపాఠశాలలో పంచమబాలురను చేర్చుకొని, ఉచితవిద్య నేర్పే ఏర్పాటులు చేశారు.

వర్ణాధిక్యత తెలిపే అహంకారచిహ్నమని పంతులుగారు జంధ్యాన్ని తీసివే

శారు. పీఠాధిపతులు' స్వాములవారుచేసే దురంతాలను బయటపెట్టారు. తోడిమానవుని నీడసోకినా మైల అంటిందనే అగ్రవర్ణాల దురహంకారాన్ని, భోజన సమయంలో శూద్రుని కంటబడితే అన్నంవిడిచే బ్రాహ్మణుల దురాచారాన్ని పంతులుగారు తీవ్రంగాఖండించారు.

ఎదుమడిపాడిచే శూద్రులకు కుండలు కడిగేఆడవాళ్ళకు చదువెందుకనే ఛాందసుల వాదనను పంతులుగారు నిరసించారు. దేశస్థితి బాగుపడాల టే సామాన్యప్రజలలో విద్యాప్రచారం అవసరమని ప్రచారం చేశారు. రాజమండ్రిలో వయోజనపాఠశాలలలో రాత్రిపాఠశాలలను నడపడానికి ప్రోత్సహించారు.

మహిళోద్ధారకుడు

పంతులుగారు బాలికావిద్య అవసరాన్ని పత్రికలలో వ్యాసాలద్వారా, ఉపన్యాసాలద్వారా ప్రచారం చేశారు. తామే స్వయంగా బాలికాపాఠశాలను స్థాపించారు. తమ హైస్కూలులో బాలికలకు ఉచితవిద్యకు ఏర్పాట్లు చేశారు.

మహిళలలో చైతన్యం కలిగించడానికి అనేక కథలు, పద్యాలు, గ్రంథాలువ్రాసి పంతులుగారు ప్రకటించారు. 1883 లో 'సతీహితబోధిని' అను మాసపత్రికను స్థాపించారు. 'సత్యవతీచరిత్రము' 'చంద్రమతి చరిత్రము' అనే గ్రంథాలు వ్రాశారు. నేటికికూడ సోదరీమణులు నేర్చుకోవలసిన వెన్నో పంతులుగారు రచించిన 'సతీహిత సూచన' గ్రంథంలో వున్నాయి.

డబ్బుకాసపడి వృద్ధులకు బాలికలను పెండ్లిచేయడాన్ని నిరసించుతూ పంతులుగారు ప్రహసనాలు వ్రాశారు. 'నరమాంస విక్రయాన్ని' ఖండించారు.

వితంతు బాలికలకు పునర్వివాహాలు పంతులుగారు ప్రచారం చేశారు. తానే స్వయంగా 35 వితంతు వివాహాలు చేశారు. చేసికొన్న వధూవరులకు ఎవరూ ఇండ్లు అద్దెకిచ్చేవారు కారు. అనేక విధాల బాధించేవారు. అందుచేత పంతులుగారే ఇండ్లు కట్టించి వారికిచ్చారు. వారి ఆలనా పాలనా అంతా ఆయనే చూచేవారు.

'వితంతు శరణాలయం' అనే సంస్థను నిర్మించారు. దానికి స్థలం, బిల్డింగులు, ధనం సమకూర్చారు.

పతితలైన స్త్రీలను సంస్కరించడానికి వారిసంతానాన్ని రక్షించడానికి 'పతిత యువతీరక్షణాలయాన్ని' నిర్మించారు. తమ దానధర్మాలతో దాని పోషణకు ఏర్పాటులు చేశారు.

మహిళలను మూఢాచారాలనుండి రక్షించడానికి, స్త్రీకూడ పురుషునితోపాటు సమాన భాగస్వామిని అనే భావం కలిగించడానికి, స్త్రీ పురుషులిద్దరూ విజ్ఞానవంతులైనపుడే సంసారం సుఖప్రదమవుతుందనే సత్యాన్ని నిరూపించడానికి పంతులుగారు కృషిచేశారు. ఒకసారి పర్యాలోకనం చేసి చూస్తే ఆంధ్రదేశంలో మహిళోద్ధరణకు పంతులుగారివలె దీక్షతో పనిచేసిన వ్యక్తి మరొకరు లేరనే చెప్పాలి.

ఆంధ్ర సారస్వతానికి యుగపురుషుడు

పంతులుగారు సాహిత్యరంగంలో ప్రవేశించేనాటికి ఆంధ్ర సాహిత్య మెలావుందో తెలిసికోడానికి పంతులుగారి పద్యాలనే

ఉదాహరించుతున్నాను. ఇవి "సరస్వతీ నారద విలాప" మనే పుస్తకంలోనివి:-

తెలియదు సుమ్మిప్పుడు నా
పలుకుల యర్ధంబు నాకె భావము లేమిన్
వెలసొమ్ములు గా కివి సం
కెళ్ళలంగ కడు నాదు మేనికి న్వెతలించున్.

దయమాలి తుదముట్ట దలకట్టు నిగ్గిడించి
ధీరుడై నన్ను బాధించు నొకడు;
పాదంబు లోపల బాదంబు లిమిడించి
వీరుడై నన్ను నొప్పించు నొకడు;
ప్రాసంబుపై బెక్కు ప్రాసంబు లడరించి
పోటు బంటయి నన్ను పొడుచు నొకడు
రెండు పల్కులు గూర్చి నిండించి నగలంచు
దిట్టయై చెవులు వేధించు నొకడు;
ఖడ్గచక్రాది రూపము లగ్గనిపించి
వర్ణముల్ మార్చి నను జిక్కుపరచు నొకడు
కుమతు లాడలెల్ల విరిచి ప్రాణములు తీయ
నొడలి పసలేక శుష్కించి యున్నదాన.

అని 'సరస్వతి'చే పంతులుగారు పలికించారు. ఇందులో నాటి ఆంధ్ర సాహిత్యం స్థితి తేటతెల్లం చేయబడింది. ఈ విధంగా జమీందారీ యుగపు సంకెళ్ళనుండి విడివడలేదు ఆనాటి సాహిత్యం.

గతరెండు శతాబ్దాలలో పెట్టుబడిదారీ ప్రపంచంతో భారతదేశానికి సంబంధాలు ఏర్పడ్డాయి. దానితోపాటు పాశ్చాత్య భాషల్లో అనేక నూతనసాహిత్యరూపాలు ఆవిర్భవించాయని మన రచయితలు కూడా గ్రహించసాగారు. పాశ్చాత్య సారస్వత వాసనలు తెలుగు సాహిత్యంవైపు కూడ ప్రసరించసాగాయి. ఈ నూతన సాహిత్య వాసనలతో తెలుగుభాషామ తల్లిని అలంకరించడంలో వీరేశలింగంగారు అగ్రగణ్యులయ్యారు

పంతులుగారే తమ స్వీయచరిత్రలో యిలా చెప్పుకున్నారు:- "తెలుగులో వచన ప్రబంధమును నేనే చేసితిని; మొదటి నాటకమును నేనే తెనిగించితిని, మొదటి ప్రకృతి శాస్త్రమును నేనే రచించితిని; మొదటి ప్రహసనమును నేనే వ్రాసితిని; మొదటి చరిత్రమును నేనే విరచించితిని; స్త్రీలకై మొదటివచనపుస్తకమును నేనే కావించితిని.

మొత్తంమీద వీరేశలింగం పంతులుగారు నూరు గ్రంథాలకుపైగా వ్రాశారు. ఆంధ్రసాహిత్యానికి ఏమి అవసరమనుకుంటే వెంటనే వాటిరచనకు పూనుకున్నారు. ప్రకృతిశాస్త్రముల కొరతగమనించి శరీర శాస్త్రము, ఖగోళశాస్త్రము వ్రాశారు. ఆంధ్రకవుల చరిత్రలేని లోటును చూచి అప్పటికి చేసిన పరిశోధనలను అనుసరించి ఆంధ్రకవుల చరిత్రను వ్రాశారు. తరువాత బయల్పడిన పరిశోధనలను అనుసరించి యీపుస్తకాన్ని సవరించుతూన్న సమయంలో కీర్తిశేషులయ్యారు.

పంతులుగారు ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే సంఘ సంస్కరణోద్యమంలో పాల్గొన్నారు. రాజమండ్రి కళాశాల లోనూ, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ లోనూ పండితులుగా పనిచేస్తూ, వితంతు వివాహోద్యమంలాంటి వాటికి నాయకత్వం వహించి నడుపుతూ యింత భాషాసేవ ఎలా చేయగలిగారా! అని ఆశ్చర్యంవేస్తుంది.

కాని సమాజ జీవితంలో పాల్గొనుట, ఉద్యమాలలో లీనమైపోవుటే పంతులుగారికి అంత రచనాశక్తి నిచ్చాయి. వారి రచనలకు జీవమిచ్చాయి. నాటి ప్రజాజీవితంలో వారిరచనలు ఒకభాగమై పోయాయి

పంతులుగారి శైలి సులభంగా వుండి ప్రజాసామాన్యంచేత మెచ్చుకోబడేది. పూర్వాచారపరులగు పండితులు, కవులు వారి రచనలలో పాండిత్య ప్రకర్ష లేదని ఆక్షేపించేవారు.

తమ పాండిత్యం రుజువుచేసికోడానికో యన పంతులుగారి "శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం" రచించారు. నీతిచంద్రిక విగ్రహంకూడా సామాన్యుల కర్థంగాని కృతకభాషలో వ్రాశారు. కాని పంతులుగారే వీటితో తృప్తిపడలేదు.

పంతులుగారి పద్యాల సరళత్వం తియ్యదనం తెలిసికోడానికి 'శాకుంతల' అనువాదాన్ని చదివితే బోధపడుతుంది. ఇదే నాటకాన్ని అనేక మంది ఇతరకవులు, పండితులు అనువదించారు. కాని అవన్నీ పంతులుగారి అనువాదానికి ఏమాత్రం పోలికకురావు.

చరణమున గ్రుచ్చుకొనె కుశాంకురమటంచు
గొన్ని యడుగులె నడచి యాకొమ్మనిలిచె:
తరువుశాఖలవస్త్రమ్ము తగులకున్న
దీసికొనుదానివలె వెన్కదిరిగిచూచె.

చల్లనై వె శ్రమంబుడపజాలిన తామరపాకు
వీవనల్
మెల్లగగొంచు వీచుదునో మిక్కిలి శీతల
మైన. వాయువుల్
సల్లలితారుణాబ్జ సదృశంబగు నీ చరణ
ద్వయంబు నో
పల్లవపాణి నా తొడలపైనిడి హాయిగ
బట్టువాడనో

పంతులుగారు నిర్మించిన సంస్థలు

వీరేశలింగంగారు హైస్కూలు వితంతు శరణాలయమేగాక టౌనుహాలును కట్టించి రాజమండ్రిపౌరుల కిచ్చారు. "హితకారిణీ సమాజాన్ని" రిజిష్టరు చేయించి ధర్మకర్తలను నియమించి పైసంస్థలన్నిటినీ వారి అధీనం చేశారు. తమ యావదాస్తిని యిలాగే ధర్మకర్తలకు అప్పగించారు. తాము నిర్మించిన వుద్యమాలకు తాము గడించినదంతా యిచ్చివేసి పంతులుగారు ఒక వున్నతమైన ఆదర్శాన్ని ప్రజలముందు వుంచారు.

ఆయాసంస్థలు పంతులుగారిఅనంతరం చురుకుగా పనిచేయడంలేదు. అందుకు కారణం ఆయాసంస్థలలో పనిచేసేవారు ఉత్సాహంతోనూ, పట్టుదలతోనూ పంతులుగారి ఆశయాలను అమలుజరుపకపోవడమే. ముందయినా ప్రజలు తగినంతశ్రద్ధ తీసుకొని వారిని సరిదిద్దవలసి వుంది.

వీరేశలింగం పంతులుగారే ఒక మహా సంస్థ. ఆంధ్ర సాహిత్యానికి ప్రజల విజ్ఞానాభివృద్ధికి, మహిళోద్ధరణకు చేసిన సేవను క్లుప్తంగా పైన వివరించాను

ఒక్క మాటలో చెప్పాలంటే పంతులుగారు ఆంధ్ర సంస్కృతిలో ఒక నూతన శకం ప్రారంభించారు. జమీందారీ యుగపు సాంప్రదాయం అనే సంకెళ్ళలో కునారిల్లుతున్న ఆంధ్ర సంస్కృతికి వారు పునర్జీవం పోశారు. శ్రీ రాయసం వెంకటశివుడుగారు సెలవిచ్చినట్లు "వీరేశలింగంగారు నవీనాంధ్రదేశమునకును, ఆంధ్ర వాఙ్మయమునకును యుగపురుషుడు"

ఆంధ్రజాతీయ పునర్వికాసం

వీరేశలింగంగారి పుట్టుకనాటికి మన దేశంలో పెట్టుబడిదారీ వుత్పత్తి విధానం ప్రవేశించింది. కాని ప్రజలను ఇంకా జమీందారీయుగపు సంకెళ్ళలోనే మూఢ విశ్వాసాలక్రిందనే బ్రిటిషు సామ్రాజ్యవాదులు వుంచారు. ప్రజలలో కులమత కక్షలు మూఢనమ్మకాలు అంతరించలేదు. జమీందారీయుగపు సాహిత్యం ప్రజాసామాన్యానికి అందుబాటులో లేదు. ప్రజాస్వామికవిజ్ఞానం అవతరించలేదు.

ఈపరిస్థితులలో వీరేశలింగంగారు రంగంలో ప్రవేశించారు. మూఢ విశ్వాసాలను, ఆచారాలను ఎదిరించి పోరాడారు. సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తేడానికి కృషిచేశారు. ఒక నూతన సంస్కృతిని ఆంధ్ర జీవితంలో ప్రవేశపెట్టారు. తద్వారా ఆంధ్రజాతీయ పునర్వికాసానికి పునాదులు వేశారు. ఇదే పంతులుగారు ఆంధ్రజాతికి చేసిన విప్లవకరమైన సేవ. కీ. శే. వల్లూరి సూర్యనారాయణగారు చెప్పినట్లు "వీరేశలింగం గారు మొదలుపెట్టినది సాంఘికవిప్లవం"

పంతులుగారు అమరజీవి

అటి మన పంతులుగారు 1919 మే 27 తేదీన కీర్తిశేషులయ్యారు. పంతులుగారు మరణసమయంలో యిలాసందేశమిచ్చారు.

"నా జీవితములో సాధించవలసిన కార్యము లింకెన్నో వున్నవి. అవి సాధించబడక పూర్వమే అసువులు వీడ వలసి వస్తున్నది. అయినా నా అనుంగులు మిత్రులు, సంస్కారాభిలాషులు నాయీ మిగిలిన బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాను. అజ్ఞానంలో, అమాయకత్వంలో జీవితసంస్కారంలేని ప్రజాసామాన్యానికి విద్య, విజ్ఞానం, సమానత్వం, సంస్కారం కలిగించడానికి కృషిచేయాలని కోరుతున్నాను." ఈ మాటలు పంతులుగారి ఉన్నతాశయాలను తెలుపుతున్నాయి.

పంతులుగారు వివిధరంగాలలో తన కృషిద్వారా ఆంధ్ర ప్రజానీకంలో జాతీయ చైతన్యం, జాగృతి కలిగించారు. ఆ మెట్టునుంచి ఆంధ్ర ప్రజలను రాజకీయంగా స్వాతంత్ర్యోద్యమం మరొక మెట్టు ముందుకు తీసుకుపోయింది. దేశభక్తిని, స్వాతంత్ర్యేచ్ఛను పునరుజ్జీవింపజేసింది.

పంతులుగారు తమ రచనలద్వారా యింకా జీవించేవున్నారు. వికసించుతున్న ఆంధ్ర సాహిత్యంలో ఆయన ఛాయలు ప్రతిబింబించుతున్నాయి. దినదినాభివృద్ధిగాంచుతున్న ప్రజావుద్యమాల ద్వారా ఆయనకృషి వ్యాప్తి చెందుతున్నది. ఆంధ్ర ప్రజానీకంలో విజ్ఞానం వెదజల్లడానికి జరిగే కృషి ఆయనను జ్ఞాపకం చేస్తూంది. అందుచే ఆంధ్ర సంస్కృతితో పాటు ఆయన చిరంజీవి!

ఈనెల 16వ తేదీన ఆంధ్రప్రజలమంతా వీరేశలింగంపంతులుగారి జన్మదిన శతవార్షికోత్సవాన్ని జరుపుతున్నాము. వీరేశలింగంగారి ఆశయాలయిన "ప్రజాసామాన్యానికి విద్య, విజ్ఞానం, సమానత్వం, సంస్కారము" కలిగించుతామని ఆరోజున శపథం చేదాం. అందుకుఅడ్డువచ్చే విద్రోహశక్తులను నాశనంచేసి ఆంధ్రజాతి ముందుకు పోతుందని ప్రతిజ్ఞచేదాం. పంతులుగారికి ఆంధ్రదేశం అర్పించవలసిన కానుక అర్థవంతమైన అంజలి అదే!

ప్రజాసాహిత్యం పంతులుగారు

శ్రీ తుమ్మల వెంకట్రామయ్య

శతాబ్దాలుగా చీకటిలోపడి కొట్టుకులాడుచున్న ఆంధ్రులకు అభ్యుదయ పంథాను జూపిన వెలుగుచుక్క-వీరేశలింగం; ఆకాశ వీధినుండి సాహితీ గంగాస్రవంతిని భూలోకానికి గొనివచ్చి, బహుముఖవ్యాప్తి గావించిన భగీరథుడు వీరేశలింగం, అని ఆయన్ని సంస్మరించుకుంటున్నాం. బాగానేఉంది.

అయితే, "తమ తరములో ఏ కొంచవు పూర్వపుచదువో చదివి, ఏ కొద్దిగా ఇంగ్లీషు పరిచయమో చేసుకొని, ఏ చిన్న ఉపాధ్యాయుడుగానో ప్రవేశించి...... ఆంధ్ర సారస్వతచరిత్రలో నూతనశకపురుషుడు"గా † వీరేశలింగంగారుఎలా కాగల్గారు.

వీరేశలింగంగారు తన కాలంలోని సమాజమస్థితిని చూచారు. భూస్వామ్య యుగపు మూఢాచారాలచేత, అజ్ఞానంచేత, ఆంధ్రజాతి నిండిఉంది. జడత్వందాల్చిన ఆయీ ఆంధ్రజాతిని మేల్కొల్పారు. ప్రజలకోసం— ముఖ్యంగా 'పామరుల' కోసం, వెనుకబడిన స్త్రీలకోసం సాహిత్యం సృష్టించారు. ప్రజలకందుబాటులోకి రావడానికి మొదట భాషను సరళపరిచారు పంతులుగారు. అభ్యున్నతికి గొంపొయ్యే కథావస్తువుతో నూతన సాహిత్యాన్ని సృష్టించారు. సామాన్య ప్రజల చిత్తసంస్కారం కోసం, విజ్ఞానంకోసం, ప్రజాసాహిత్యాంకురాలను మొలకెత్తించారు.

అభివృద్ధి నిరోధక శక్తులతో, పంతులుగారూ అతని అనుచరులు గావించిన పోరాటాలను, ఆనాటి ఆచార దురాచారాలను, పాత కొత్తల భావ ఘర్షణను, కాల

† బుర్రా శేషగిరిరావుగారు

గర్భంలో లీనమైపోకుండా సాహిత్య రూపం కల్పించారు. అభ్యుదయ పంథాను సుగమం చేయడానికి సాహిత్యాన్నొక వజ్రాయుధంగా పెట్టుకొని, అడ్డువచ్చిన దుష్టశక్తుల నన్నిటినీ ఛేదించుకొంటూ సమాజ సంస్కార ప్రచారం చేసుకుపోయ్యారు పంతులుగారు.

వీరేశలింగంగారు గ్రంథరచన నారంభించింది 1870 ప్రాంతంలో. ఆనాటి పరిస్థితులేమిటి?

అప్పటికింకా కవులు "పురాణాదులలోని యేదో ఒక అంగం ఆధారంగా పెట్టుకొని అలంకార శాస్త్రాల కొలతలతో ప్రబంధాలనే పేర అప్పటి పోషకుల తత్వానికి అనుగుణంగా శృంగార రసమనే పేరుపెట్టి, సంబంధం ఉన్నా లేకున్నా అష్టాదశవర్ణనలూ దింపి, క్షుద్రాతిక్షుద్రమయిన కామాన్నే పోషిస్తూ రచన సాగించారు." ¶ "క్రొవ్వుకారెడు నాయికా నాయకుల ఊహామాత్రములైన కష్టములను" * వర్ణించుతూ వచ్చేవారు.

¶ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు

* కట్టమంచి రామలింగారెడ్డిగారు

ప్రాథమికదశ గాబట్టి వీరేశలింగంగారికి కూడ మొదట ఆ ప్రబంధ వ్యామోహం ఉండటంలో ఆశ్చర్యం లేదు. ఆయన ప్రబంధ రచనకు పూనుకొన్నారు.

రసికజన మనోరంజనం అనే ప్రబంధం వ్రాశారు. కాని యివి వ్రాసేటప్పుడు కూడా "మిశ్ర ప్రబంధాలు నూర్లకొలది ఉన్నాయి" గాబట్టి శుద్ధాంధ్ర ప్రబంధంగా దాన్ని మార్చివేశారు.

ప్రబంధం రచించారే గాని పంతులుగారి ఆత్మకు సంతృప్తి లేదు. రోతపుట్టించే పాతపద్ధతులను విడనాడటానికి ఆయన మనస్సు తహతహ లాడుతోంది. అందుచేతనే "ఇనను నే నటువంటి శృంగార ప్రబంధముల కామోదింపను. ఇప్పుడు పద్యకావ్యమును రచయించవలసి యుండిన ఎడల నేనిట్టి శృంగారకావ్యమును రచియించి యుండను." § అని అన్నారు.

"ఇంచుమించుగా తెలుగు భాషలోనున్న ప్రబంధములన్నియు

§ స్వీయచరిత్ర 142-వ పేజీ

కామినీ కచకుచ సంభోగాది వర్ణ నలతో నిండియుండి యేకరీతిగా నుండుటచేత... శృంగార ప్రబంధ ములు చేయు మేలుకంటె కీడెక్కువగా నుండునన్న సిద్ధాం తమునకు" పంతులుగారువచ్చారు. 'అభాగ్యోపాఖ్యానం' అనే రచన ద్వారా ప్రబంధపంథాను పరిహ సించారు. ఉదాహరణకు యీ పద్యాన్ని చూడండి. పూర్వం ప్రబంధాలలో—

"జాయనుజూపవేమి యను
జాయను నవ్విధి యెంతచేసె నా
రా యను నీడుగండె బలు
రాయను నాత్మపరాక్రమోన్నతుల్
రోయును గానవాంతరము
రోయును దుష్టకురంగ చేష్ట సు
మ్మాయను జానకీ దనుజ
మాయను గ్రుంగితెపల్కు మాయనున్."
(రామాభ్యుదయము)

అనే ధోరణిలో వ్రాస్తే, మన పంతులుగారు అభాగ్యోపాఖ్యా నంలో రంకులాడి యొకతె గుల్లో దూరిన సందర్భంలో, నాయకుని యెదుట దూతిక ఒకటి దానినుద్దే శించి ఇలా అంటుంది—

డాయను భీతిఁబొంద మగ
డాయను దల్పులుతీయరాదె రం
డాయను బల్కవేమి చెపు
డాయను సొమ్ములుపెట్టు అంకుమం
డాయను వేగరావె మొఱ
డాయను లోపలజేరి యేడ్వ గా
డాయను సిగ్గుబూను టిపు
డాయను నెచ్చెలి మాటిమాటికిన్.

తర్వాత రెండవకూర్పులో తన ప్రబంధంలోని మోటుగా నున్న పద్యాలను, పదాలను చాలవరకు పంతులుగారు తీసివేశారు.

ప్రబంధయుగంలో కూడా కవు లకు గారడీలు చేయడం అలవా టయింది. ఒకరు నిర్వచనం వ్రాస్తే మరొకరు నిరోష్ఠ్యం వ్రాసేవారు. అదీ ఇదీ గాక ఇంకొకరు ద్వ్యర్థి కావ్యం. (ఒకే కావ్యానికి రెండు కథలు) వ్రాశారు. రాఘవ పాండ వీయం వగైరా ఇందు కుదాహర ణము.

వీటి ప్రభావంకూడ ప్రారంభ దశలో వీరేశలింగంగారిపై పడక పోలేదు. అందుచేతనే "శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం" వ్రాశారు. అయితే "ఇన్ని నిర్బంధ ములతో తుద ముట్టించిన గ్రం థము... యర్థసారస్వాదియోగ్యత లచేత నెంత మాత్రమును పొంద

దగినదిగా యుండ నేరదు" అని అన్నారు పంతులుగారు. కాని ఈయన మనస్సులో జనసామాన్యం ఉంది. వారి కోసం రాయాలనే కోర్కె ఉంది. జనసామాన్యం మామూలుగా వాడుకొనే భాషకే వ్యాకరణ నియమాలను అనువరింపజేసి సులభ భాషలో ఈ ప్రబంధం వ్రాశారు. కూచిమంచి తిమ్మకవి అచ్చ తెనుగులో రామాయణం వ్రాశాడు. దానిలో మిగిలిన భాగాన్ని ఉత్తరకాండను "శుద్ధాంధ్రోత్తర రామాయణ" మనే పేర వీరేశలింగంగారు తెనిగించారు. అయితే ఈ తెనిగించడంలో కూడా జనసామాన్యాన్ని మనస్సులో పెట్టుకున్నవాడవడం చేత తిమ్మకవిలా "కృతక భాష" రాయలేదు. అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారి లాగా ఛాందసానికి పోయి "పూర్ణ చంద్ర ముఖి" అంటే- "నిండు నెల మూతిదాన" అని అనువదించనూ లేదు. వీరేశలింగంగారి సులభ శైలికి ఉదాహరణముగా—

చ. వడివడి బాలుతెంచి యొక
పైదలి యూర్పులుప్పుచ్చి నవ్వినన్
బడతుకయోర్తు చాలిపుడె
నవ్వకుమంతయు తేపెగట్టిగా
గొడుకుల తల్లివౌదు వొక
కొంచెము నాటికి దాచుకొమ్ము నా
నుడికి నెలంతయుం గడుపు
లుబ్బగ నవ్విరి కొమ్మలందరున్.

(శుద్ధాంధ్రోత్తరరామాయణము)

తెలుగులో వచన కావ్యాలంతగా లేవు. ఉన్న- విక్రమార్కుని కథలు, పంచతంత్రం, కాశీమజిలీలు మొదలైనవాటిని పండితులు 'గ్రామ్య' మని నిరాదరించుతూ వచ్చారు. సముఖం వెంకటకృష్ణప్ప నాయుడు రచించిన జైమినీభారతం లాంటివి వేళ్ళమీద లెక్కపెట్టదగినట్లుగా ఉన్నాయి. ఇంకా ఏమైనావున్న వేమోగాని వాటిని బైటికిలాగి వ్యాప్తికి తెచ్చిన మహానుభావులు లేరు. నీతిచంద్రికను రచించిన చిన్నయసూరినే, వచన రచనకు ఆదర్శవ్యక్తిగా తీసుకోడం పండితలోకంలో మామూలయింది. "నవీన వచన గంగావతరణమునకును చిన్నయసూరి భగీరథుని వంటివాడు" అని పింగళ లక్ష్మి

కొంత కవిగారు ఒకచోట సెలవిచ్చారు. కాని చిన్నయసూరిది గిడుగు రామమూర్తిగారి మాటలో "కృతక భాష". అందరికీ అందుబాటులో లేనిది. వీరేశలింగంగారు కూడ, చిన్నయసూరి సగం సగం వ్రాసి విడిచిపుచ్చిన నీతిచంద్రిక రెండవ భాగాన్ని వ్రాయడానికి పూనుకున్నారు. 'విగ్రహం' వ్రాశారు. కాని అదికూడ నీతిచంద్రిక శైలిలోనే నడిచింది. పంతులుగారే—

"దీన సామాన్యముగఁ దొంటి తెలుగు కవులు వాడియున్నట్టి పద వాక్య పద్ధతులనె యేర్చి కూర్చినవాఁడ గవీంద్రులకును మించుగా డెందముల రుచియించుకొఱకు"

అని చెప్పుకొన్నారు.

కాని వారు "రచియించిన విగ్రహతంత్ర మెల్లచో నెంతయు గష్ట శైలి రచియింపగఁ బడ్డదటంచు బల్మఱున్ వింతగ" లేఖలు పాఠకుల నుండివచ్చాయి. అందు చేకొంతవర కుసులభ శైలిలో "సంధి" భాగాన్ని పూర్తిచేశారు. పాఠ్యగ్రంథాలుగా వాటిని పెట్టారు. ఇపుడూ పెడుతున్నారు. కాని ఇలా వ్రాసినందువల్ల పండితులు ఆనందించవలసిందేగాని సామాన్యప్రజలకు ప్రయోజనం ఏమిటి? రచయితలు విరజిమ్మే "నీతిచంద్రికలు" పామర జనుల అజ్ఞానతిమిరాన్ని పోగొట్టుటకేనా? అయితే పంచతంత్రం కన్నా దీనివల్ల కల్గిన లాభం ఏమిటి?

అలాగే రాజశేఖరచరిత్ర తీసుకుందాం. ఈ గ్రంథరచన ద్వారా మొదటి ఉత్తమనవలను ప్రకటించిన గౌరవం పంతులుగారికి దక్కిన మాట నిజమే. "క్లేశప్రదమును, కఠినమును గాక సంస్కారహీనమగు గ్రామ్యమును గాక" యున్నదని ఆనాటి పండితులు మెచ్చుకున్నా, ఆ పుస్తకాన్ని "చదివి తెలిసికొనగలిగినవారు (మాత్రమే) దీనిని మెచ్చిరి" కాని, "సామాన్య జనులు దీనిని గ్రహించలేకపోయినందున దీనివలన వట్టి పొగడ్తలే గాని రశ్మియేమియు......కలుగలేదు." అని పంతులుగారు విచారించవలసి వచ్చింది. పంతులుగారి మనస్సులో ఘర్షణ బయలుదేరింది.

"భాషవలని ప్రయోజనమేమి? జనులు తమ యభిప్రాయముల

నొండొరులకు దెలుపుకొనుట, భాషలోని గ్రంథముల వలని ప్రయోజనమేమి? తమ భావము లను దూరమున నున్నవారికిని, రాబోవు తరములవారికిని సులభ ముగా తెలుపుట. అట్టిసౌలభ్యము విగ్రహామువంటి పుస్తకములవలన గల్గునా?"అని తర్కించుకొన్నారు. తుదకు సులభంగా వ్రాయాలని నిశ్చయించుకొని తమ అభిప్రా యాన్ని పండితలోకం ముందు పెడితే, పండితు లంతా నిరసిం చారు, పరిహసించారు. అయినా వాటిని లెక్కచేయక సులభ శైలిలో బ్రాహ్మవివాహం వ్రాశారు. అది ప్రజల్లో బాగా చొచ్చుకుపోయిందని వేరే చెప్ప నక్కర్లేదు.

వీరేశలింగంగారు గ్రంథాలను సలక్షణమైన సులభ శైలిలో వ్రాయాలనేవారే. అలా అని వారు గ్రామ్యభాషను నిరసించ లేదు. స్వీయచరిత్రలో ఇలా వ్రాసు కున్నారు— "విషయానుగుణ్యంగా తత్తదుచితరీతిని గ్రామ్యభాష యందు సహితము గ్రంథములను వ్రాయవచ్చునని కూడ నా యభి ప్రాయము." అలా అనడమేగాదు, వ్రాశారుకూడా. వ్యవహార ధర్మ బోధిని గ్రామ్యంలోనే వ్రాశారు. సులభశైలి వ్రాసున్నందుకే తిట్లు, దీవెనలు పొందుతున్న ఆకాలంలో పంతులుగారు ఇలాంటి భావాలు ప్రకటించారంటే అది చాలా గొప్ప విషయం. అంతేగాదు, అవ సానదశలో "వర్తమాన వ్యావహా రిక భాషా ప్రవర్తక సమాజా"నికి అధ్యక్షత వహించారు. కాని ఈ విషయమై ఎక్కువ కృషి చేయక ముందే పరమపదించారు.

భాషా సౌలభ్యానికి పంతులు గారు పడిన శ్రమనుగురించి చెప్పా లంటే—ఇంకా ఎన్నో ఉదాహరణ లివ్వవచ్చు. అభిజ్ఞానశాకుంతలాన్ని ఎంతమంది అనువదించినా వారిదే ఉత్తమ అనువాదంగా పరిగణింప బడుతుంది. వారి శాకుంతలంలోని "చల్లని వైశ్రమంబుపజాలిన" అనే పద్యం "చల్లని వైశ్రమంబు" గా మారి నాటకరంగంలో ప్రసిద్ధి కెక్కడం మనం అంతా ఎరిగిందే.

ఇలా చెప్పాలంటే చాలా వున్నాయి. నవీన వచన గంగాస్రవంతిని నానా ముఖాలుగా ప్రవహించడానికి వీరేశలింగంగారు యెలా కారణభూతులయ్యారో నేనిక్కడ వ్రాయడం లేదు. ఆయనలో భాష విషయమై యెలాంటి పరివర్తనం జరిగిందో పైన చూపాను. "చ్యుతసంస్కారము కానట్టియు, హీనమును, గ్రామ్యమును కానట్టియు" అని పంతులుగారి సమకాలికులు మెచ్చుకొనే గ్రాంథిక భాషలో వ్రాసినప్పటికి, పంతులుగారు భాషను ప్రజలకందుబాటులోకి తేవడానికి ప్రయత్నించి చాలవరకు సఫలులయ్యారు. ప్రజా సాహిత్యానికి గట్టి పునాది వేశారు. ఇందుకు వారెంతముందో ఛాందసులను ఎదుర్కోవలసి వచ్చింది. బుర్రా శేషగిరిరావు చెప్పినట్లు, కొక్కొండ వెంకటరత్నం మొదలగువారితో వీరేశలింగమూ, అతని అనుచరులూ జరిపిన పోరాటంలో వీరేశలింగ ప్రభృతులే గనుక జయించకపోయినట్లయితే, మన ఆంధ్ర సాహిత్యాభివృద్ధీ - తత్ఫలితంగా జరిగిన విద్యాభివృద్ధీ కూడ శూన్యమయి ఉండేవి.

"సర్వమును బ్రాతదని యెందు సాదుగాదు
క్రొత్తదనియె కార్యమునకు గొరతరాదు"

అనే ఆత్మవిశ్వాసంతో ఛాందసులతో ఢీకొని, నూతన రూపాలతో బహువిధాల వచన రచనకు పూనుకొని పంతులుగారు అభినవ గద్యతిక్కన బిరుదును పొందారు అంతమాత్రాన పాతరూపాలనన్నిటిని నిరసించలేదు. ('అభాగ్యోపాఖ్యానం'లో ప్రబంధ ధోరణిని నిరశించినా, అలా వ్రాసి యుండవలసింది కాదని తర్వాత భావించారు. బహుశా అతిగా పోయానేమో, అని వారు భావించియుండవచ్చు.) పాత కథావస్తువులనే తీసికొని, వాటిలో సంస్కార భావాలను జొప్పించారు పంతులుగారు. ఈ సందర్భంలో పంతులుగారిలా చెప్పుకొన్నారు. "సంఘదురాచార సంస్కరణమును, పరిశుద్ధ మత ధర్మ ప్రకటీకరణమును నామనస్సు నెప్పుడును బాయకుండును గాన నేనే పుస్తకము జేసినను దానిలో నవకాశ మున్న

మొదల నే సందర్భమునైనను వాని సంచుక జొప్పించుచుందును."

ఉదహారణకు ప్రహ్లాద నాటకం తీసికొండి. నరసింహమూర్తి చేత కృత్రిమభక్తులను చీవాట్లు పెట్టించు

"దుద్దునామము పెట్టి తులసిపేరుల దాల్చి
ప్రొక్కు మాత్రనె మీకు ముక్తి లేదు"

తాడు. అని అనిపించుతాడు.

చంద్రమతీ చరిత్రలో మామూలుగా జెప్పుకొనే కథకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వలేదు. చంద్రమతికి ఆమె గురువు విద్యాసాగరుడు చెప్పినట్లు, తానునమ్మిన అనేక నీతిమత ప్రాథమిక ధర్మాలను పంతులుగారు బోధించారు. ఉదహారణకు స్త్రీ విద్యను గురించి " బుద్ధిమంతు డెవ్వడుగాని విద్యాగంధమే లేని పశుతుల్యునితో నిముషకాలమైనను సహవాసము చేయనొల్లడు; అట్టి సంగతిలో స్త్రీలను జదివింపక పశువులతో సహవాసము చేయునట్లు సదా యవిద్యావతులతోడనే సహవాసము చేయవలయునని యుపదేశించువా డెంతటి బుద్ధిమంతుడగునో నేనుజెప్పనక్కరయుండదు."

సత్యా ద్రౌపదీ సంవాదం తీసికొండి. భర్తను వశంజేసికోడానికి మందులు మాకులూ పెట్టాలనే మూఢనమ్మకాలను పారద్రోలడానికి పాట వ్రాశారు.

"......మందులమాకుల మంత్రతంత్రములు
బతుల వశ్యులజేయ భ్రమపడుటెల్ల
బెద్ద వెఱ్ఱితనంబు బింబఫలోష్ఠి"

అంటూ మొదలెట్టారు.

సంఘ దురాచారాలను ఎత్తిచూపి, వాటివలన గలిగే అనర్థాలను, సామాన్యప్రజలకు సైతం అర్థమయ్యేటట్లు పంతులుగారు వ్రాశారు. అలా వ్రాసేటప్పుడు హాస్యాన్ని (కొన్నిచోట్ల మృదువుగాను, కొన్నిచోట్ల మోటుగా కూడ) వజ్రాయుధంగా పెట్టుకొన్నారు. హాస్యంతో నిండిన సులభ సంభాషణలతో అభివృద్ధి నిరోధక శక్తుల గుట్టునంతా బయటపెట్టారు. ఆయన ప్రహసనాలలో ఆనాటి సాంఘికసమస్యలను తీసికోనిది లేదు. మ్యునిసిపాలిటీ దగ్గర నుండి, స్త్రీవిద్య, వితంతు వివాహం వరకేగాక, ప్రతికక్షుల దురాగతాలవరకూ ఇందులో విశ

రించారు. "తిర్యగ్విద్వన్మహాసభ" "మహారణ్యాధిపత్యం" మొదలైనవి ఇందు కుదాహరణ్లాలు.

బ్రాహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని అనే గ్రంథాలను అందరూ ఆదరించారంటే కారణం భాష (ఒకటి వ్యావహారికం కూడా) సరళ మవడం మాత్రమే కాదు. నిత్యము సమాజంలో కొందరు అనుభవించే కష్టాలు అందులో ప్రతిబింబించడంవల్ల ప్రజలు వాటిని ఆదరించారు. బ్రాహ్మ వివాహంలో వివాహేచ్ఛ గలిన వితంతువులు గత్యంతరం లేక ఎలాంటి దుర్వృత్తుల నవలంబిస్తారో, తల్లిదండ్రులకు లోలోన విధవ పుత్రికలపై ప్రేమ ఉన్నా సంఘానికి జడిసి ఎలాంటి దుష్టకార్యాలు చేస్తున్నా చూసి దిగ్భ్రమింగుతారో తెలియజేయబడింది. అంతే కాదు. కన్యాశుల్కం, వృద్ధులకు పసిపాపల నంటగట్టడం మొదలయిన వాటిని గూడ ఎదుర్కొన్నారు. వ్యవహార ధర్మబోధనిలో ప్లీడరుగారు అమాయకుల డబ్బు గుంజే విధానాల్ని తెలియజేశారు. కన్యాశుల్కంలోని గిరీశం ఎలా చిరపరిచితుడయ్యాడో, అలాగే ఆ కాలములో బ్రాహ్మ వివాహం లోని "పెద్దయ్య," వ్యవహారధర్మబోధిని లోని "ప్లీడరు" అందరినోటిమీదా ఉండేవారు. పడవ నడిపే పల్లెకారి సైతం ఈ "ప్లీడర్ నాటకం" చదివి ఆనందిస్తోంటే పంతులుగారు విస్తుపోయారు.

సంఘసంస్కారం కోసం పాటుబడే పంతులుగారు సాహిత్యాన్ని తమ ప్రచారక ఆయుధంగా పెట్టుకొన్నారు. లంచగొండులను, అన్యాయవర్తనులను, సంస్కార విరోధకులను నిరసించుతూ, పరిహసించుతూ బహుముఖాలుగా సాహిత్యాన్ని పెంపొందించారు. అంతమాత్రాన యిది సాహిత్యం కాదనీ, ఇందులో కళ లేదనీ ఎవరైనా అనగల్గుతున్నారా? అలా అన్న ఛాందసులంతా ప్రజలకెంత దూరమయ్యారో చరిత్రయే రుజువు చేసింది.

పంతులుగారు ప్రజలను దృష్టిలో పెట్టుకొని భాష నేవిధంగా సులభం గావించి ప్రజాసాహిత్యా

నికెలా పునాది వేశారో చెప్పాం. పాతకథలకే కొత్తభావాలను జత చేయడమూ చూచాం. ప్రహసనాలను 'ఆక్షేపగర్భ' సంభాషణలను సృజించి, సాహిత్యాన్ని ఒక వజ్రాయుధంగా చేసుకొని ప్రచారంకోసం సాహిత్యాన్నిఎలా వినియోగించుకొన్నారో కూడ చూచాం.

వెనుకటి సాహిత్యాన్ని నిరసించడంతోనే సరిపోదు. ప్రతికక్షులయిన అభివృద్ధినిరోధకులను పరిహసించుటతోనే పని పూర్తికాదు. నిర్మాణాత్మకంగా కూడ పని చేయాలి. ఇదివరకు ఉదహరించిన గ్రంథాలలో కూడ నిర్మాణాత్మక సూచనలు లేకపోలేదు. కాని'ఆడు మళయాళం' (సత్యరాజ పూర్వ దేశయాత్రలు) లాగా భావవిప్లవం లేపినగ్రంథం మరొకటుండదేమో. కూతురికో, కోడలికో, చెల్లెలికో భర్త పోయినపుడు శిరోముండనం చేయ తలపెట్టిన ముష్కర ఛాందసుడు సైతం ఆడు మళయాళంలో పత్ని చనిపోయినవాడికి ముక్కు కోసివేస్తారని చదవంగానే ఆలోచనలో పడకమానడు.

"పురుషున కిమ్మహి బత్నియె,
పరయుంబగు దైవతంబు"—అనీ;
"కష్టురోగిష్టియైనను, గ్రుడ్డిదైన,
భూరి వికలాంగియైనను ముసలిదైన
బత్ని యెంగిలి భుజియింపవలయు"—అనీ;
"పురుషుండును గార్ధభమును,
స్థిరముగ దండనములేక చెడిపోదురిలన్"

అని చదివేటప్పుడు స్త్రీలను హీనంగా చూస్తూవచ్చిన ఏ మగవాడు తల వంచుకోకుండా ఉండగలడు?

ఆడుమళయాళంలో సహగమనము మొదలుకొని ఘోషాపద్ధతి వరకు చర్చించడమే గాదు; నోములు మొదలైన మూఢవిశ్వాసాలనుగూడ పంతులుగారు హేళన చేశారు.

"స్త్రీల కెన్ని నోములున్నవో, యీ దేశమునందు పురుషుల కంత కంటె రెట్టింపునోములున్నవి. ఆదివారము నాడు ప్రాతఃకాలమున కంద పిలకను, సాయంకాలమున పెండలపు దుంపను పూజింతురు సోమవారము మధ్యాహ్నం సన్నె కంటెని, సాయంకాలమున రుబ్బు

రోటిని పూజింతురు" ఇలా గే తర్వాత గ్రంథంలోకూడ జ్యోతిశ్శాస్త్రం పేరిట జరిగే మోసాల్ని ఖండించారు.

ఇవి అభూతకల్పనలే అయినా, పాఠకుల కొక ఆలోచన కల్పించి, తాము చేయుచున్న పనులకు సిగ్గుపడేటట్లు భావవిప్లవం లేపాయి.

పంతులుగారి రీతటితో ఆగలేదు. స్త్రీలకు విద్య కావాలని చెప్పడంతోనే సరిపోదని, విద్యావంతులయిన దంపతుల ఆదర్శ జీవితం ఎలా ఉంటుందో చూపించడానికి సత్యవతీ చరిత్ర వ్రాశారు. పురాణలలో పతివ్రతలకు ఎన్నో అద్భుతమహిమలు అంటగడతారు. కానిదీనిలో అలాగాదు. ఇది స్త్రీలకని ఉద్దేశింపబడి వ్రాసినా, పురుషులుకూడా ఆదర్శంగా తీసికొని చదవసాగారు. కొందరు తమ బిడ్డలకు 'సత్యవతి' అని పేరు పెట్టుకున్నారంటే, ఈ పుస్తకం ఎంత వ్యాప్తి చెందిందో తెలుస్తూ వుంది.

ఈ పుస్తకంలో అనేక రకాల దాంపత్యాలను సృష్టించారు. ఒకటి సత్యవతీనారాయణమూర్తుల దాంపత్యం. విద్యావతులై యుక్తాయుక్తవివేకంగల దంపతులజీవితం. వివేకహీనులైన బంధువులు మొదలగువారివల్ల కొన్నికష్టాలు కలిగినా ఆదర్శవంతమై భూతల స్వర్గంగా ఉంటుందని వీరి పాత్రల ద్వారా చూపించారు. భర్త చదువుకొని మూఢుడు, భార్య విద్యావతి; ఇదొక దాంపత్యం. దంపతులిరువురూ చదువురాని మూర్ఖులు;ఇది మరొకటి. భర్తవిద్యాధికుడు,భార్య చదువురాని గయ్యాళి.ఇదింకొకటి. వీటి అన్నిటిలోనువిద్యావంతులైన, దంపతుల జీవితమే ఆదర్శవంతమైన జీవితమని పైనచెప్పిన సత్యవతీ — నారాయణమూర్తులను సృష్టించారు.

కావ్యరచనకు ఉత్సాహపడే వారికి తెలిసేటట్లు పంతులుగారు దానికి సంబంధించిన శాస్త్రాలను తెలుగులో అర్థమయ్యేటట్లు కుప్తరూపంలోకి తెచ్చారు. సంగ్రహవ్యాకరణం, కావ్యసంగ్రహం అలంకార సంగ్రహం, తర్కసంగ్రహం ఇలాంటివే. ఇంతేగాక ఆంధ్రకవుల చరిత్రవ్రాసి, చరిత్ర

జ్ఞానభిక్ష పెట్టారు. స్త్రీలకూ, పిల్లలకూ అవసరమైన నీతులూ, హితబోధనలూ సల్పారు.

చరిత్రలూ, ప్రకృతి శాస్త్రాలు మొదలయినవి పంతులుగారి కాలానికి లేవు. అందుచే తెలుగు భాష అంతా కవిత్వం కోసమే బ్రతికిందా అన్నట్లు పూర్వపు పండితుల చేతిలో ఉండేది. ఆంధ్ర దేశంలో ప్రకృతిశాస్త్రజ్ఞాన ప్రథమభిక్ష పెట్టినవారు కూడా పంతులుగారే. మొదటపదార్థ వివేచకశాస్త్రం తెనిగించడానికి పంతులుగారు పూనుకొన్నారు. తర్వాత ప్రొఫెసర్ హక్స్లే వ్రాసిన ఫిజియాలజీని అనువదించి 'శారీరకశాస్త్ర సంగ్రహం' అనే పేరుతో ప్రకటించారు. తర్వాత జ్యోతిశ్శాస్త్ర సంగ్రహం (గ్రహాలు, నక్షత్రాలు మొదలయినవాటి గురించి) ప్రకటించారు. గ్రహణాలకు కారణం యీ పుస్తకం పీఠికలో వ్రాసి ప్రజలకుండే పూర్వపు మూఢనమ్మకాన్ని పారద్రోలడానికి ప్రయత్నించారు.

ప్రకృతిశాస్త్ర పరిజ్ఞానం లేనిదే మానవుడు ప్రకృతికి దాసుడై పిచ్చి పిచ్చి నమ్మకాలను కల్గియుంటాడు. ఇలాంటి ప్రజాసామాన్యానికి చిత్తసంస్కారం, విజ్ఞాన ప్రబోధం గల్గించే సాహిత్యాన్ని రచించడంలో పంతులుగారే మొదట దారితీశారు. తర్వాత విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలివారు ప్రకృతి శాస్త్రాలను విశేషంగా తెలుగులోకి తెచ్చి, యెక్కువ సేవచేశారు. ఈనాడు యిలాంటి ప్రకృతి శాస్త్రజ్ఞాన ప్రదానము, చరిత్రజ్ఞాన భిక్ష మొదలగునవియే, "లోకమునకు కవిత్వముకంటె యెక్కువ ఉపకృతి చేయుచున్నవ"ని శ్రీపింగళి లక్ష్మీకాంతంగారు భావించుతున్నారంటే ఆశ్చర్యం లేదు.

• • •

ఆకలి యాత్ర

శ్రీ కుంమర్తి ఆంజనేయులు

కదిలిందొక మహాయాత్ర
కలవారిపై దండయాత్ర
సగంతిండి తినిబ్రతికే
శ్రమజీవుల క్షుధాయాత్ర!

ఆకలి! ఆకలి! లోకం
చీకటితిని బ్రతుకుతోంది,
ఆకలియాత్రలతో లోకం
లో కలవర మెక్కువైంది

రిక్షాలూ, లాగుడుబండ్లూ
నడియెండకు నిలబడినై
రైలు ఇంజన్ అరుస్తోంది
ఆకలితో కదల్లేక!

ఆకలి ఆవేదనతో గాలి
వీచలేక కూచున్నది,
హాలం చాలులో క్షుధతో
పొలం మెలికలై తిరిగింది.

కదిల్చిందొక మహాయాత్ర
కలవారిపై దండయాత్ర
కూటికి గుడ్డకు వాచిన
కోటినరుల కోపయాత్ర!

౨

హాలాలలో దున్నేవారిని
బొగ్గుగనుల్లో పనివారిని
పగలురాత్రి ఫ్యాక్టరీల
పొగలో బ్రతికే వారిని

తమశ్రమ వృథాగా, యజమానికి
ధనంకూర్చి పెట్టేవారిని
తమకు హక్కుగల ఈ సకలం
తమదని తెలియనివారిని

గాలివాన గర్జిస్తోంది
కారుతోంది పూరిగుడిసె
పూరిగుడిసెలో దీపం
పోయి దిగుల్ పడేవారిని,

అర్ధాకలితో కడుపులు
మలమలమాడే వారిని
కలుపుకోండి! పస్తులతో
కాలంగడిపేవారిని.

3

అందరు మనలో కలిశారా!
అంబుధి పొంగింది పదండి!

పదండి ! పదండి అడుగుదాం
పరిపాలించే వారిని !

కడుపుకాల్చుకొని చాకిరి
కాదిక మావల్లకాదు
పదండి ! పదండి అడుగుదాం
పరిపాలించే వారిని !

నిల్వలున్న కలవాళ్లను
నిలేసి అడిగేశేద్దాం
వరిపాతర కలవాళ్లను
నలుగురిలోకి పిలిపిద్దాం !

అందరికీ తిండీ గుడ్డా
అందిస్తారా లేదా !
పదండి పదండి అడుగుదాం
పరిపాలించేవారిని

౪

భూమితల్లి పండుతుంది మన
బువ్వకు కొరతేమి లేదు.
పాతరలోతుల ఖైదుల్లోని
పంటతల్లిని విడిపిద్దాం !

జమీందార్లు దున్న లేని
వేలవేల యకరాలు
సమ సబంజర్లూ, బీళ్లూ
సాగుకు మాకివ్వండి !

నాల్గునెలల కాలంలో
నల భైకోట్ల ప్రజలకు
బంగారం పండిస్తాం
తిండికొరత తీరుస్తాం !

ఒకటే మాకు నినాదం
తిండిలేంది ఊరుకోం !
జగత్తు ఒక నిమిషంలో
జడమయమై పోతుంది !

పదిమంది స్వార్థవ్యక్తులు
పాలిస్తున్నారు మనల్ని,
ఓటు లేదుగాని మనం
నూటికి తొంభైమందిమి !

వారిచేతకాకుంటే మనమే
ప్రభుత్వాన్ని నడుపుకుందాం
పదండి ! పదండి ! అడుగుదాం
పరిపాలించే వారిని!

★ ★ ★

సంధి లేదు

[కథానిక]

శ్రీ తెన్నేటి సూరి

౧

డేరాల్లో చోటులేక, సిపాయిలంతా గొంగళ్లు ముసుకుపెట్టుకొని, ఆ గొడ్డు చలిలో, ఆరుబయటే, వాటిముట్టా పడుకున్నారు. చలికి, ముడుగ్గొడ్డులా, మూలుగుతున్నారు. ఆ పలుగురాళ్ళలో నిద్ర పట్టక, ఇనపముళ్ళ అంపశయ్యల మీద పడుకున్నట్టు, గిజాటుగా యిటూ అటూ మెసులుతున్నారు.

సన్నీలు తొడిగిన తుపాకులు ఓదాని కోటి సంతరించి, సేనావారమంతా చెరకు తోటలా నిలబెట్టున్నెయ్. ఆ చెరకు తోటకు మధ్యగా, నైజాం సిపాయిలు, యేదు బందుల్లా పొర్లాడుతున్నారు.

అంత బలగాన్ని పెట్టుకుని 'మోతేమీం ఈ అరణ్యంలో, అక్కడ మకా మెందుకు పెట్టాడో సిపాయి లెవ్వరికీ తెలియదు. నెలరోజులుగా, వాళ్లంతా, అక్కడ పడిగాపులు పడి వస్తున్నారు. చుట్టూవున్న వూళ్ల ప్రజలంతా నైజాంమీద కత్తికట్టి వీర విహారం చేస్తున్నారు. అంచేత, తిండి తిప్పలూ కూడా, సరీగా సరఫరా గాక, ఆర్థాకలితో కూడా మాడి చావలిసొస్తోంది.

తక్కిన క్యాంపుల్లో సిపాయిలంతా, ఊళ్లమీదబడి, హాయిగా దోచుకుతింటున్నారు. ఏటుపోతుల్ని, మందలకి మందలకు కోసుకుతిని, తెగ బలుస్తున్నారు. కనపడ్డ ఆడబాపన్నల్లా చెరిచి, ఖుషీగా తిరుగుతున్నారు.

ఈదిక్కుమాలిన మోతేమీం, ఊరు పల్లె లేని ఈ నట్టడవి మధ్యంలో, పగలే చిరుతపుల్లు తారాడుతున్న యీ కొండల్లో ప్రాణాలెందుకు తీస్తున్నాడో · తెలీక, తికమక పడుతున్నారు. అక్కడంతదాకా అట్టాచ్చావాలో · అంతూపంతూ కూడా లేకుండావుంది.

'మద్ర్' అన్న ఒకమాట, ఆ సైన్యంలో, మధ్యమధ్య, దూదిమేటిలో పడ్డ నిప్పురవ్వలా, గుసగుసా వ్యాపించి, మళ్లీ స్థానం తటికదే చల్లారి పోతూవుంటుంది. దాని అర్థమేమిటో మాత్రం అందులో ఎవ్వడికీ తిన్నగా తెలియదు. తెలిసినా రెండో వాడితో చెప్పడు. కాని, ఆమాట సేనావారంలో చలిగుబుల్లా జిమ్ముకు మాంటూ వ్యాపించగానే, భయంభయంగా బిక్కుబిక్కుమని దించుకుపోయి, అంతా గజగజలాడుతారు.

ఉండుండి, అప్పుడప్పుడు, 'పహారా హూషార్'! అన్న కేకలుతప్ప, సేనావా

రమంతా, నచ్చిపడుతున్నట్టు నిశ్శబ్దంగా వుంది.

మోతేమీరుంకి మాత్రం నిద్రపట్టడంలేదు. అతను, తనడేరా ముందు జ్వాలలుగా మండుతున్న నెగడులోకి చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అప్పుడప్పుడు దూరదర్శినిలోనుంచి అరణ్యమధ్యలో దూరానవున్న, ఒక పెద్ద కొండవేపు, చూస్తున్నాడు. అందులో చీకటితప్ప మరేమీ కనుపించటంలేదు.

నల్లగొండ జిల్లాలో నట్టడవిలో వుంది ఆ పర్వతం అమావాశ్యరాత్రేమో అంధకార మావరిస్తూ అరణ్యమంతా 'జిమ్ము'మంటోంది చెవులు చిల్లులు పోయేలా, కీచురాళ్లు ఈలకోళ్లు కూస్తూ భయంకరంగా వుంది.

తుపాకులు బుజాన పెట్టుకుని ఇద్దరు వ్యక్తులు, గుసగుసా మాట్లాడుకుంటూ, ఆకొండ చరియవెంట పైకెక్కుతున్నారు. వెనక నడుస్తున్న మనిషి, ముందుమనిషిని ఎడనెడా ప్రశ్నిస్తున్నాడు.

"ఆవిడ మీ ప్రాంతానికి వచ్చియెన్నాళ్లయి వుంటుంది లంబాడీ?" —

"మూడుమాసాలుగావొచ్చిందిసామీ!"

"ఎర్రటి పొడుగాటి మనిషేనా?"

"అవునాయమ్మే సామీ!—కాలుబాగు నడిసి—మీయంతెత్తునా వుంటది—పోలిక నిశా, మీపోలికేనంటే !—"

"అవును నాకు మల్లేనే వుంటుంది— మేనరికంతే." ఇద్దరూ నిశ్శబ్దంగామరికొంత దూరం నడిచారు

లంబాడీ!—"

"హాఁ!—"

"ఇంకా ఎంతెత్తుకుందీ?—"

"అదిగో!...అదే ... పడమరేపుకొండ కొమ్మునీ...నాయేలికిసూవారు గా...అల్లదట్టంగ ... సీకట్లో సెట్లు కదలాడతా వుండయ్...సూసినవ్?...అల్లది సిరిసింత మడగసామీ!...ఆమడగలోనే అగుహాం కాది—ఇంకెంతో దూరం లేదులే...దగ్గిరకొచ్చేసినమ్—"

"మీగూడెంలోనన్నా అట్టిపెట్టుకోక ఒక్కదాన్నే, దిక్కులేకుండా, ఈకొండ గుహాలో ఎందుకట్టేపెట్టారులంబాడీ?—"

"కాలా సేతలా బడి బతిమిలాడినమ్ సామీ! ఆయమ్మ సనేవన్నది. బయమెయ్యదా?' అంటే అంతబయమేసే నాయనమ్మలు నవాబు రాచ్చసుల్తోటి పోరాడేదేందని' మొగోళ్లందర్ని యాళాకోళం బట్టితే నోరుమూసుకు నూరుకున్నం."

ఇద్దరూ, చకచకా నడిచి, గుహదగ్గిరికి చేరుకున్నారు. గుహచుట్టూ చిరిచింతమాన్లు దట్టంగా పెరిగి కోటగోడలావుంది. చెట్లలోనుంచి సన్నటిత్రోవగుండా, ఇద్దరూ లోపలికినడిచారు. చెట్లకీగుహాకీ మధ్య కొద్దిగా ఆవరణవుంది.

గుహాలోపల చిన్న కిరసనాయిలు బుడ్డి కొడిగట్టి ఎర్రగామండుతూంది. చీకట్లు దీపాన్ని మ్రింగుతున్నయ్.

ఆ వెలుగును ఆధారంచేసుకుని లోపలికి వెళ్లబోయారు. రామిరెడ్డి కాలికి ఏదో పాముపడగలా తగిలింది. వంగి పరీక్షగా చూశాడు- బూటు కాలు!

"ఇక్కడే పండుకుందిలంబాడీ!"

"బాగా అలిసిపోయివున్నట్టు ఒళ్లు తెలియకుండా నిద్రపోతూవుంది. మగ వాడిదుస్తులు-మిలటరీయూనిఫారంలోవుంది. కాలిబూట్లుకూడావిప్పకుండా, తలక్రింద మోచెయ్యి పెట్టుకుని అలానిద్రపోతుంది. ప్రక్కనేసన్నీ అమర్చినతుపాకీనుందుకంపు గొడుతోంది. బొడ్లోవున్న, కైజారుపిడి, చీకట్లో మిలమిలలాడుతోంది.

దండ చేతిక్రింద తుపాకి పోటీగా ఆనుకుని లంబాడీ దూరంగా పోయి నిల్చున్నాడు. రామిరెడ్డి నిద్రించుచున్న ఆవీర మూర్తి శిరస్సువేపుకు పోయి మోకాళ్ల మీద కూర్చున్నాడు: ఆ కొండరాళ్లమీది నుంచి ఆశిరస్సును తన తొడమీదికి తీసుకున్నాడు. చిక్కగా రేగిపోయిన జుట్టు కొనగోట నిమురుతున్నాడు.

నుదురంతా, చిరుచెమటు బోసివుంది— ఉత్తరీయంచెంగుతో నెమ్మదిగా అద్దాడు. రామి రెడ్డి కళ్ల వెంట దిగజారుతోన్న కన్నీరు, లంబాడీకి చీకట్లో కనిపించలేదు గాని, లోపల్నుంచి తెరలు తెరలుగాపొర్లుకొస్తున్న దుఃఖాన్ని మ్రింగుకుంటున్న ఎక్కిలిమాత్రం ఒకటి వినిపించింది.

"ఏడవమాకు బాబూ! ఆయమ్మని కాసంత నిద్రపోనియ్యి — యెన్నాళ్లయిందో కన్నుమూసి—"

చిక్కిపోయిన ఆమె చెక్కిళ్లు తనచేత్తో నిమురి చూసుకున్నాడు. వెచ్చగా నుసిలి పోతున్నయ్. ఆహస్తస్పర్శతో కాంచెంగా మెలుకువచ్చి, ఏదో సర్పం పడగవిప్పి బుసబుస నాడుతోందను కొని ఒడుపేసి చివాల్న పట్టుకుంది. కంగారుగా లేచి నిల్చుంది—

ప్రక్కనే మిలిటరీ యూనిఫారంలో పురుషవ్యక్తి. బొడ్లోనుంచి కన్పున కైజారు దూసింది.

"కంగారు పడకుద్రా! నేనే!"— బాకెత్తిన ముంజేయి పట్టుకున్నాడు, రామి రెడ్డి.

గొంతు గుర్తుపట్టింది— "హాఁ!... మీరా...?"—

కొండంత యేడుపు ముంచుకొచ్చింది. కడుపు కోసుకు పోతున్నట్టు ఆవురుమని బిగ్గరగా యేడ్చేసి, కలవరంగా భర్తను కౌగిలించుకో బోయింది మళ్లీ, వెంటనే యేదోవాత తిన్నట్టు చప్పున చేతులురెండూ ముఖంమీదికి ముడిచేసుకుని, ముఖం అరి చేతుల్లో క్రమ్మేసుకుని దూరంగాపోయి నిల్చుని వలవలా యేడిచేసింది.

అనునయించుతూ లేచివెళ్లి అప్యాయంగా ఆ లింగనంలోకి అలుముకుని డొక్కలోకి తీసుకోబోయాడు.

"వొద్దు తాకొద్దు...హాఁ...హాఁ దణ్ణం పెడతాను" అంటూ తప్పించుకు దూరంగా పోయి ఎక్కెక్కి యేడుస్తూనిల్చుంది.

"కుక్కముట్టుకున్న బొచ్చెని...అంటుకోబోకండి.... నేనుచచ్చిపోయాననుకోండి ...తలెత్తుకు మీముఖంలోకి చూళ్లేను. ...నాగుండె కోసుకుపోతోంది వెళ్లిపో బావా!... నాఆశవదులుకో.. నేనుబ్రతకలేను."

"ఏమిటీపిచ్చి రుద్రా"—

"నేనారోజే చచ్చిపోయాను. ఈశరీరం నేను కాదు ..నాపిశాచం...పిశాచమై తిరుగుతున్నాను. వాడి శిరస్సుగొట్టిమీ పాదాల దగ్గిర పారేసి నీకచ్చతీరుస్తాను. అప్పుడు శాంతంగా ప్రాణాలు విడుస్తాను అందాకా ఈ భారతశ్మశానంలో ఇలానే, పిశాచంలా అంధకారంలో తిరుగుతూవుంటాను. నా బ్రతుకంతా ఇలా...ఇలా...కుమిలి తగలడి పోయింది...ఇంటికి వెళ్లండి... మీకు నమస్కారం చేస్తాను. అంతామరిచిపోండి. మన కీజీవితంలో ఇక —" గుండె తరుక్కుపోయి గగ్గోలుగా యేడ్చింది.

"చిన్నీ?"—

"నా దేవుడు నన్నాదరించగలడని నాకు తెలుసు... నేనే బ్రతకలేను. ఆపిశాచం... ఆకుక్క... ఆపిశాచా లంటుకున్న ఈ కుళ్లు బొచ్చెవాడు. నమిలివిడిచిన ఈపాడు కండలు...వాడు ఎంగిలిచేసిన ఈపాడు బుగ్గలు...నీకు...నీకు ఇంకా...కావాలా బావా?— ఛీఛీఛీ ...ఈ కుళ్లుకూపం ...ఈ చండాలం - ఈ రోతకండలు... ఛీఛీ-ఛీ-ఛీఛీ..."

అంతా చీకటిగా వుంది — ఒక్కొక్క మాటే అంతకచ్చగా అంటోందేవిటా అని దగ్గిర కెళ్ళిచూశాడు.

చేతిలోవున్న కైజారుతో కచ్చ కొద్దీ బుగ్గలు కండలు కండలుగా కోసేసు కుంటోంది ఒళ్లు తెలియని ఆవేశంతో.

"చిన్నీ! చిన్నీ! ఆ! ఆ!"—చప్పున పోయి కైజారు బలవంతంగా లాక్కున్నాడు.

కైజారు వదిలేసి గప్పున యెగిరొచ్చి తుపాకి అందుకుంది. త్రాచుపాములా చెట్లల్లోకి రివ్వున దూసుకు పోయింది.

ఇద్దరూ వెంటబడ్డారు. అందకుండా అంధకారంలోకి అదృశ్యమైపోయింది.

కంపనబడ్డ కాకుల్లా ఇద్దరూ చెట్లూ పుట్టలూ, గుట్టలూ, కొండ చరియలన్నీ పొదపొదా, గాలించి వెదుకుతున్నారు. ఎక్కడా ఆనవాలేనా దొరకలేదు.

లంబాడీ నిప్పుపుల్లగీసి చేతిలోవున్న కాగడా వెలిగించాడు. కాగడా, భగభగా, కొరివి దయ్యంలా జ్వాలగా మండి అంధకార గర్భాన్నంతా నెత్తురు ముద్దలా ఎఱ్ఱబడేస్తోంది.

3

డేరాముందు నిల్చుని దూరదర్శినితో ఆ కొండవేపు చూస్తున్నాడు, మోతేమిాం.

ఎఱ్ఱటిజ్వాలా రేఖ!!!

ఆ పాదమస్తకం కంపిల్లిపోయాడు. కంగారుగా అ చాడు—

"జీ!!"—

డేరాలో తప్పతాగుతున్న యూరపియన్ సార్జెంటు మిస్టర్ ఉల్ఫ బయటకొచ్చాడు. (కూలిబుచ్చుకుని మనుష్యుల్ని కూనీచేసే ఈ బాపతు యూరోపియన్ పెద్దమనుష్యులు ఇంకాచాలా మంది వున్నారు నైజాంసైన్యంలో). మోతేమిాం అతని చేతిలోవున్న బ్రాందిబాటిల్ తీసుకుని దూరదర్శిని అతని చేతికిచ్చాడు.

వాడు దూరదర్శినిలోనుంచి చూచి 'వాట్'—అంటూ ఒక పెద్ద గోండ్రు బెట్టాడు. దాన్ని మోతేమిాం మీదపా

లేసి, డేరాలోకి పరుగెత్తి రైఫిల్ తీసుకున్నాడు. రివ్వునపోయి గుర్రంమీద కురికి చెవులు గింగురెత్తిపోయేట్టు విజిలేశాడు.

గుర్రపుదళం కొండమలుపు తిరుగుతోంది. గుర్రాలడెక్కల చప్పుడుతో, చుట్టూవున్న పర్వతాలన్నీ మారుమ్రోగిపోతున్నయ్. తోకమట్టు లెగబట్టుకుని గుర్రాలు నాలుగుకాళ్లమీదా లేచి గాలిలోకి ఎగిరిపోతున్నయ్. కొండలోయలోనుంచి అశ్వికదళం అరణ్యంలోకి జలపాతంలా ప్రవహిస్తోంది.

వృద్ధసైనికుడు, రసూల్ తన గుర్రాన్ని మేనల్లుడి గుర్రానికిప్రక్కగాపోనిచ్చాడు. దానికళ్లాలు అందిపుచ్చుకుని బ్రుసత్రోవ తప్పించాడు.

"క్యాహై?"—

"ష్!"—

తక్కిన అశ్వికదళమంతా రెండు సెకండ్లలో రివ్వున ముందుకువెళ్ళిపోయింది. రసూల్ రెండుగుర్రాల్ని డొంకదింపి చింతల తోపులోకి నడిపించాడు. కొంచెం దూరం చెట్లచాటుకు పోయి,తరువాత ఆపి, క్రిందికిదిగాడు. మేనల్లుణ్ణికూడా దిగమని సంజ్ఞచేశాడు గుర్రాన్ని ప్రక్కనున్న చెట్టుకు కట్టేసి, ఒక పెద్ద రాతిబండమీదకుపోయి, "అల్లా" అంటూ తాపీగా చతికిలపడ్డాడు. కాసిం అదంతా యేమీ అర్థంకాక తికమకపడుతున్నాడు. ఇద్దరూ ఇలా, ఉర్దూలో సంభాషించుకున్నారు.—

"ఏమిటిమామా?"—

"ఏమీ లేదు లే... కూర్చో!"—

"వెళ్లొద్దూ?"

"హై! హై! హై!"—

"ఏమిటీ?"

"ఎక్కడికి?— —చావటానికా? వాళ్ళంతా చాలరూ?"

"చావటం?"—

"రుద్!"—

"హాఁ!"— కాసిం నిలువునా కంపిల్లిపోయాడు.

"హాఁ!—బైటో—"

కాసిం పిల్లికూనలా పోయి మేనమామ ప్రక్కన కూర్చున్నాడు. ఆమాట వినగానే అతనికెందుకనో భయమేసింది. ఇదేమాట సైనికులంతా భయంభయంగా గుసగుసలాడుకోటం తను విన్నాడు. ఆ సంగతేమిటని యెవళ్ళడిగినా, యేమీ లేదంటూ యెవళ్ళకువాళ్ళు సద్దుకున్నారుగాని తనకి తెలియనిచ్చారుకాదు. కాని ఆసంయుక్తాక్షరం వినిపించగానే, ఆ క్యాంపులోవున్న ప్రతివాడూ హడిలిపోవటం మాత్రంఅతను గుర్తించాడు. వరంగల్లో నుంచిఅదనంగా తెప్పించిన అశ్వికదళంలో తను అయిదారు రోజులక్రితమే ఇక్కడికొచ్చాడు. మేనమామ యీ ఫౌజులో వున్నాడు గదా అని తనూ అక్కడికి వేయించుకున్నాడు. ఇక్కడికొచ్చిన ఈ స్వల్పకాలంలోనే, ఇక్కడేమో, ఒక భయంకరమైన వాతావరణం సైన్యంమీద వ్యాపించివున్నట్టు అతనికి తోచింది. ఏక్షణానికాక్షణం ఏదో మృత్యుముఖంలో వున్నవాళ్ళలా, వాళ్ళంతా హడలుతున్నారు

"మామా!"

"...   ..   ..."

"రుద్ర్ క్యాహై?"—

"మృత్యువు—తలకొవ్వి తాచుపాము జోలికి పోయాడు—ఇప్పుడు గడగడలాడి చస్తే ప్రయోజనమేమిటి?— వాడికి చావు యెలాగో స్థిరం"

"తాచుపామెవరు మామా?"

"రుద్ర్"

"రుద్ర్ క్యాహై?—

"చెప్తా...ఇలాకూర్చో— మావూరు దేశముఖ్ ఆ పశువు నాగిరెడ్డి తెలుసా?"

"తెలియకేం? మన క్యాంపులోనే వున్నాడుగా?"

"వాడు పట్టి లుచ్చా! నా మూడెకరాల భూమీ కాజేశాడు"

"నీభూమి వాడెలా కాజేశాడు?

"మీఅమ్మ పెళ్లికి మీఅయ్య వాడిదగ్గిర ఒక వంద రూపాయలు అప్పు తెచ్చాడు. ఎన్ని వందల రూపాయలు జమవేసినా, ఇక ఆ అప్పు తీరలేదు. డబ్బు తీసుకోవడమే తప్ప జమ వేసుకునేవాడుగాదు. జమలన్నీ పల్లకాడైపోయి అప్పుమాత్రం తిరుగుకడ్డీలతో పదిహేనువందలు తేల్చాడు"

"అరే అల్లా! — దావాయెందుకేశావు గాదూ?"—

"హాహాహా!...వాడిమీద దావా వేస్తే వాడే విచారించుతాడు.— అందాకా యెందుకు చివరి రోజుల్లో కట్టిన డబ్బుకు రసీదిమ్మన్నాననేగా సొంత నాళ్లు పంపించి నాభూమి దున్నించాడూ."

"ముస్లిం రాజ్యంలో ఈ కాఫిర్ గాడి జులుమేమిటి మామా?"

"ఈపిచ్చేమన్ని నెత్తిణుస్తోంది. ఈ అవకాశం చూసుకునే ఈ నైజాం నవాబూ ఈ జాగిర్దారులూ, ఈదేశముఖులు, వీళ్లంతా కలిసి మన నెత్తురు త్రాగుతున్నారు. లేకపోతే వీళ్ళసంగతి యెప్పుడో కనుక్కోవలసింది."

"ముసల్మాన్ నవాబుని అగౌరవంగా మాట్లాడుతున్నావ్.....నాకేమీ బాగులేదు మామా!"—

"నీకింకా కుర్రతనం—అర్థంకాలేదులే. వరంగల్ క్యాంపులో, నవాబు యేజెంట్లు ఆ ఇత్తిహాదుల్ వాళ్లు ఈ పిచ్చంతా నీకు నూరిపోసుంటారు.

"మామా!!"—

"అరవకు— సంగతంతావిను— నీబుర్ర తిరుగుతుంది. మావూళ్లో ఫరీద్ అని ఒకతనున్నాడు; మనవాడే; చాలా బీదవాడు. అతనికొక కూతురుంది— ఇమాంబీ. వయసొచ్చిన పిల్ల. దానిమీద కన్నేశాడు దేశముఖ్. ఏదో వంకపెట్టి దాన్ని దేవిడికి పిలిపించాలని చూశాడు. వాడిసంగతంతా తెలుసుగా— అపిల్ల వెళ్ళలేదు. ఎత్తుకు రమ్మని వాళ్లింటిమీదకి గూండాల్ని పంపించాడు. వాళ్లు కత్తులూ కర్రలూ పుచ్చుకుని ఫరీద్ కొంపమీదబడి జాతర చేస్తున్నారు.

"మావూళ్లో రామిరెడ్డిగారని శాస్త్ర చదువుకున్న పెద్దమనిషి ఒకాయనున్నారు. ఆయన, ఈజులుమంతా చూసి ఊళ్లోకలు గుర్నిపోకుచేసి—"చూస్తూఊరుకుంటారేం? ఇవ్వాళ ఆతనిపిల్లమీద యెగబడ్డారు;

రేపు మనపిల్లమీద యెగబడతారు; యిల్లా కాలం ఈ అన్యాయాలు ఇలా జరుగుతూ వుండాలిసిందేనా ?"—అన్నారు.

ఊరంతా కలిసి, ఆ వెధవల్ని పట్టుకుని, మెత్తగా నలగ్గొట్టారు. దేవిడీదగ్గిరికిపోయి ఇలాంటి పాడుపనులు చేస్తే యిక మర్యాద దక్కదని దేశముఖ్ తో చెప్పారు.

వాడాపళంగా యేంజేశాడో తెలుసా? వరంగల్ పోయి ఈ మోతేమీంతో ఆలోచించి, కొంతలంచం పారేసి, వీణ్ణీ, కొంతమంది సిపాయిల్నీ తీసుకొచ్చి ఊరుముట్టడించాడు. ఇళ్లన్నీ లూటీజేశారు. ఇల్లువరసని ఆడవాళ్లందర్నీ చెరిచారు. నీచెల్లెల్ని కూడా చెరిచారు— వింటున్నావా ?— నీ చెల్లెల్నికూడా చెరిచారు"

"హా! నాకు కబురన్నా చేయలేదేం మామా ?"—

"హుఁ!— ఏమని కబురు చెయ్యమన్నావ్ ? అవమానంతో, గుండెలుచీరుకుని మేంచచ్చింది చాలదూ ? పైగా మీకూడా యీసంగతి కబురేంచెయ్యమన్నావ్ ?"

"అదీ, పసిసన్నాసి; ఈ అవమానంతో అది కుమిలి కుసిల్లి పోతోంది. పిల్లడు యెంత అనునయించి ఓదార్చినా అదివాణ్ణి చేరా చెంతలా జేరనివ్వటంలేదు. వాడి ముఖంలోకి చూడాలంటే దొంగై మూల మూలలకి కిక్కి అభిమానంతో అటుమట్టించి యేడుస్తోంది. దానివొంటిమీద దానికే అసహ్యం పుట్టుకొచ్చింది. నూతికీ గోతికీ పరుగెత్తుకుంటే మీ అత్త కాపలాగాయలేక చస్తోంది"

"బావెక్కడ మామా?"—

"మావూరంతా యెక్కడున్నారూ— వాడూ అక్కడేఉన్నాడు"

"అదేమంటే?"

"ఆ దాడిలో వూరంతా తగలేశారుగా! వూళ్లోవున్నవాళ్ళంతా అడవిలోకి పారిపోయారు. రామిరెడ్డిగారి నాయకత్వం క్రింద కత్తిగట్టి, యీ దేశముఖ్ నీ యీ మోతేమీంని, ముక్కలుముక్కలుగా నరికి చిత్రవధ చెయ్యటానికి సిద్ధంగావున్నారు. ఇవ్వాళో రేపో జరుగుతుంది."

"మరింతకీ, రుద్రదేవరు మామాఁ ?"

"రామిరెడ్డిగారి భార్య; ఆ తల్లిని యీ మోతేమీం బలవంతాన మానభంగం చేశాడు. కొంతకాలం, ఆతల్లి యేమైపోయిందో కూడా యెవ్వరికీ తెలియదు. ఇపుడీ అరణ్యమంతా ఆ పేరే మారుమ్రోగుతోంది. ఈ అరణ్యంలోవున్న లంబాడీ గూడేలన్నీ ఆ తల్లిని ఒక దేవతగా కొలుస్తున్నారుట. ఆవిడకోసం, పాపం రామిరెడ్డిగారు, అహోరాత్రులూ, వెతుకుతున్నారు. ఇద్దరూ కలుసుకోగలిగితే యెంతైనా బాగుండును."

"మరి మీ వూరివాళ్ళంతా కత్తిగట్టి వీళ్ళని నాశనంచెయ్యాలని చూస్తుంటే నువ్వింకా యీ సైన్యంలోనే యెందుకున్నావు మామాఁ ?"

"తుపాకులు కాజెయ్యటానికి"— కాసింకి మతిపోయినట్టుయింది. క్రాఫింగు జుట్టులోకి వేళ్లు పోనిచ్చి పిచ్చలదీసుకుంటూ అయోమయంగా కూర్చున్నాడు.

రసూల్ తనగుర్రాన్ని కళ్లెంలుబుచ్చుకుని మేనల్లుడి దగ్గిరకి తీసుకొచ్చి నిల్చోబెట్టాడు.

"ఇలారా! ఈ కట్ట చూశావా?"— గుర్రంమీద, రికాబుల ప్రక్కగా వ్రేలాడుతున్న ఓకట్ట చూపించాడు— "అందులో ఒక అరడజను తుపాకులున్నయ్. వీట్ని మనవాళ్ళకందజేస్తాను. నువ్విక్కడేవుండు"

"అలాగైతే మన రెండు తుపాకులూ కూడా తీసుకుపో మావాఁ?"

"అలా కాదు; మనతుపాకులు మనదగ్గిరే వుండాలి. మనచేతిలో తుపాకు లేపోయాయంటే మనమే కాజేస్తున్నామని అనుమానపడతారు."

"మళ్లీ యింకా మనం సైన్యంలోకి వెడదామంటావా? పోనీ ఇక మనవాళ్ల దగ్గిరికి వెళ్లిపోతేనేం?"—

"మళ్ళా సైన్యంలోకి వెళ్ళకపోతే తుపాకులెట్టావస్తై?— తెలివితక్కువగా మాట్లాడతావేం?— నీ సంచిలో వున్న తోటాలుకూడా యిలా నా సంచిలో పొయ్యి. రేపట్నుంచీ మరికొంచిని తీసుకుంటూ వుండు. చేతికందిన తుపాకిల్లా కొట్టేసి, నదివొడ్డునున్న గంగరావిచెట్టుందే దాని మొదట్లో ఇసకలో పాతేస్తూవుండు. అవకాశం దొరికినప్పుడు పెల్లగించుకుపోయి మనవాళ్ళకిచ్చేస్తూ వుంటాను— నువ్విక్కడే వుండు. నేనరగంటలో తిరిగి వచ్చేస్తాను."

"నేనుకూడా వస్తేనేం మావాఁ!... చెల్లిని చూస్తాను"—

"వీల్లేదు— నీమీద నాకింకా నమ్మకం కలగాలి"—

"నా చెల్లిల్ని చెరిచిన వెధవల కోసం మనవాళ్ళని దగా చేస్తానా మావాఁ?"

"నేను తొందరపడను— నేను కొంత అవకాశం తీసుకుంటే ఇందులో నాకొచ్చే నష్టమేవింటీ?"—

నసూల్ గుర్రాన్నెక్కి పొదలగుండా అరణ్యంలోకి చొచ్చుకుపోయాడు.

కాసిం ఒక చెట్టు క్రీనీడకు గుర్రాన్ని తొర్చి చెట్టుమొదటికి కట్టేశాడు. తను మరో పెద్దబండచాటుకుపోయి దానికానుకు కూర్చుని మేనమావ వెళ్లిన త్రోవ వెంటే ఆశ్చర్యంగా అరణ్యంలోకి చూస్తున్నాడు.

దూరాన నట్టడవిలోవున్న ఆ కొండ చుట్టూ తుపాకి కాల్పులు ఆకాశం మీద కొరడా దెబ్బలు చరిచినట్టు భీభత్సంగా ధ్వనిస్తున్నయ్.

మోతేమీరం క్యాంపులో, డేరాలచుట్టూ వున్న నెగళ్లన్నీ, వండివుండి జ్వాలలారి బూడిదముఖాలు వేసి, ఆలోయంతా చీకటిబడిపోయింది.

ఉల్ఫ వెంటవెళ్లిన సైన్యం వెళ్లగా, అక్కడ మిగిలిన వాళ్లందరూ, మృత్యుముఖంలో వున్నట్టు గుండెలు పీచుపీచుమంటూవున్నా గానిద్ర జోగుతున్నారు. ఒకడూ అరా, అక్కడక్కడ బీడీను కంటించి ఒకదమ్ములాగి నలిపి రాళ్లలో పారేసి మళ్లా గొంగడి ముసుగుబెట్టుకు పడుంటున్నాడు.

వెంతేమీరం, యేమీ తోచక, డేరాలో నుంచి బయటికీ బయటినుంచి డేరాలోకి రబ్బరుపాత్రంలా తిరుగుతున్నాడు.

తెల్లవారుఝాము కావొచ్చింది—

దూరాన కొండదగ్గర కాల్పులు మరింత ఉధృతంగా వినిపిస్తున్నాయి.

మోతేమీం, ఆలోచిస్తూ డేరాలోకి వెళ్లాడు. నౌకరు లేచినుంచుని, 'హుజూర్' అని పలకరించాడు. మోతేమీం బల్లమీద వున్న గ్లాసు చేత్తో తీసుకున్నాడు. ప్రక్కనున్న బాటిలుతీసి నౌకరు గ్లాసునింపాడు.

గటగటా త్రాగేసి, సిగరెట్టు ముట్టించాడు: నిస్పృహగా కుర్చీలో చతికిలబడి మధన పడుతున్నాడు.

ఉన్నట్టుండి, అకస్మాత్తుగా, డేరాల మధ్య, "ధన్, ధన్" మని, రెండు తుపాకి దెబ్బలు వినిపించాయి.

"రుద్ర్!!" — సింహాన్ని చూసి హడలిపోయిన ఏనుగు, తొండం పైకెత్తి. గీపెట్టినట్టు, ఒక సైనికుడు ఆకాశం అస్చరు పోయేట్టు అరిచేశాడు.

మోతేమీం కుర్చీలోనుంచి కంగారుగా లేచాడు.

శిబిరాలచుట్టూ పడుకున్న సైన్యం, కలత నిద్రలో లేచి కల్లోలమైపోయింది. ఆ చీకట్లో ఏందేవిటైంది. తెలియక కంగారుకొద్దీ 'ధనాధనా' ఒకళ్ళనొకళ్ళు తమలోతామే చికాగ్గా కాల్చుకుని సుడి పాలు బడి చస్తున్నారు.

మోతేమీం, బల్లమీదవున్న స్టెన్‌గన్ తీసుకుని ముందుకు అడుగువేశాడు.

డేరా వెనకభాగం బర్రున చీరుకు పోయింది.

వెనక్కుతిరిగి చూచేలోగా అతని తల నేలమీద దొర్లిపోయింది.

నేలమీదపడి, గిలగిలా తన్నుకుంటున్న ఆ మొండెం గుండెలమీద కూర్చొని, కైజారుతో వాలికలు వాలికలుగా చీరుతోంది — రుద్ర. వాని రక్తాన్ని ఒంటినిండా, ముఖంనిండా ఒళ్ళు తెలియని ఆవేశంతో చికాగ్గా పులిమేసుకుంది. వాడితల చేత్తో పట్టుకుని ఆకాశంలో కత్తి వేళ్ళలోకి చూసి, కచ్చకొద్దీ పకపకా నవ్వి భయంకరంగా వికటాట్టహాసం చేసింది.

నెత్తురోడిపోతున్న ఏటాకత్తి కుడి చేత్తోనూ, వాడితల యెడం చేత్తోనూ పట్టుకుని బయటికి పరుగెత్తింది. శిబిరం ముందున్న, అరిసెనగడ్డలో సిపాయిలతలలు గుట్టలు పడుతున్నాయి.

ఈ భీభత్సమంతా చూసి, గుండెలు కడ చెట్టిపోయిన నౌకరు బల్లక్రింద దూరేసినవాడు, బల్లక్రిందే కిక్కురుమనకుండా చచ్చిన శవంలా బిగుసుకుపోయాడు.

దూరాన నట్టడవిలో, కొండదగ్గర రణరంగం కొండదగ్గరే సాగుతోంది. జ్వాలాతోరణాలుగా కాగడాలు వెలిగించుకుని, మరో పెద్ద ప్రజాసైన్యం, నఖముఖాలా డేరాల్ని ముట్టడించి భీభత్సంగా సంకుల సమరంచేస్తున్నది.

చచ్చిన నైజాం నాజీసైన్యం చచ్చారు. మిగిలినవాళ్లు ప్రాణాలుదక్కించుకుని పరారీ అవుతున్నారు.

గండ్రగొడ్డలి బుజాన పెట్టుకుని రామిరెడ్డి మోతేమీం డేరాలోకి పరుగెత్తుకొచ్చాడు. డేరాఅంతా కలియవెదికాడు— ఎవ్వరూ కనుపించలేదు.

తరువాయి 46-వ పేజీలో

అంకితం:
తెలంగాణావీరులకు

రెండు గీతాలు

శ్రీ అనిశెట్టి
సుబ్బారావు

మాతృభూమి పిలుస్తోంది
మారుపలుక వేమిరా!

అడుగడుగున కంఠమెత్తి
ఆకస మూగించురా,
అణువణువున ఆయువూది
అగ్నిని రగిలించురా!

మాతృభూమి పిలుస్తోంది
శత్రువు నెదిరించరా!

పూలచేల నీ నెత్తురు
పుష్కలముగ చిమ్మరా,
పురాదాస్య పరాభవము
పూర్తిగ కడిగేయరా!

మాతృభూమి పిలుస్తోంది
మారుపలుక వేమిరా!

ఉక్కు బందిఖానాలను
ముక్కలు చెయ్యాలిరా,
గడియసేపు కాలమాపి
గతలోకం మార్చరా!

మాతృభూమి పిలుస్తోంది
మానవుడా లేవరా!

ఒక్క కానిసున్నా ఈ
లోకానికి ముక్తిలేదు,

పిడికిళ్లెత్తి జగతును
పిండి కొట్ట వేమిరా !

2

కోట శత్రు జండాతో
కోరి పిలుస్తోందిరా !
గుండెనిండ పౌరుషాగ్ని
మండేవాడెవడురా !

ఒక తన్నుకు కోటగోడ
ప్రక్కలు చెయ్యాలిరా,
శిరసునెత్తి కోటబురుజు
ఛిద్రం చెయ్యాలిరా !

కోటమీది ఆ జండా
కోరి పిలుస్తోందిరా !
గుండెనిండ పౌరుషాగ్ని
మండే వాడెవడురా !

గుండె నొడ్డి సింహాసన
పీఠం పెకలించి లేచి
కోట కొమ్మ కెక్కి విజయ
ఘోషతో మార్మోయరా !

కోటమీది ఆ జండా
కోరి పిలుస్తోందిరా !
గుండెనిండ పౌరుషాగ్ని
మండే వాడెవడురా !

తుపాకి గుండ్లకు దేహం
తూట్లుపడిన ధూళిమైన
పిడికిలి పిడుగై జండా
పెకల్చి తేవాలిరా!

వీరేశలింగంగారి ★
★ సాహిత్యకృషి

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

• • •

ఈ యుగంలో తెలుగుజాతికి పెద్ద దిక్కుగా పరిగణించ వలసిన వాళ్లు ఇద్దరున్నారు. ఒకరు వీరేశ లింగం పంతులుగారు, రెండోవారు గురజాడఅప్పారావుపంతులుగారు. అప్పారావుగారు మహాకవి; ప్రతి తెలుగువాడు భగవద్గీతకిందరోజూ పఠించ వలసిన ఒక గేయంద్వారా ఒకసమగ్ర జీవితసందేశంఇచ్చాడు. అభ్యుదయ జీవితానికి కావలసిన నీతీ, విశ్వాసాలూ, కార్యక్రమం యావతూ అందులో వుంది.

వీరేశలింగంగారు కర్మిష్ఠి. ఆయన కార్యక్రమం ఒక సందేశంతో తీరిపోయేదికాదు. జాతిని చెవులుపిండి, బుద్ధిచెప్పి, కోప్పడి, కొట్టి అడుగడుగునా విమర్శిస్తూ మంచిమార్గాలు చూపిస్తూ నిజంగానే ఒక పెద్ద దిక్కై వుండి కాపాడుతూ వచ్చారు. గారాబంతో గాని, లేనిపోని మెప్పులతోగాని, లాలనతోగాని ఆయన తెలుగు జాతిని మభ్యపెట్టి, "పాడు" చెయ్య లేదు. మౌఢ్యమూ, మకురు తనమూ బలిసిపోయివున్న యీ జాతి వీరేశలింగంగారి పెంపకానికి లొంగివచ్చిందిగాని, దీన్ని పట్టుకు రావటం మరొకరివల్ల సాధ్య మయ్యేదికాదు.

తన సమకాలికులలో బలవంతుల వర్గాన్ని తన రచనలద్వారా శ్లాఘించీ, రంజింపజేసీ, సమర్థించీ వారి ఆదరాభిమానాలు సంపాదించుకుని వారిచేత బ్రహ్మరథం పట్టించుకోవాలంటే వీరేశలింగం గారికి అసాధ్యమైన పనిగాదు. ఆయనకు బహుభాషా పాండిత్యమూ, వివిధ సాహిత్య సంప

రమూ, శీఘ్ర రచనాశక్తీ ఉండేవి. కాని జాతికి ఎడంగా నిలబడే స్వార్థమూ, జాతియొక్క యోగక్షేమాలను గురించి నిర్లక్ష్యమూ మాత్రమే ఆయనలో లోపించాయి. తల్లి పిల్లలకు ఎడంగా నిలబడి వారి మన్ననల కొరకు తాపత్రయ పడటం ఎంత అసాధ్యమో వీరేశలింగంగారు సాహిత్యంద్వారా స్వార్థం చూసుకోవటం అంత అసంభవం. తన ద్వారా జాతి పైకి రావటమే ఆయన ఆత్మవిశ్వాసం. అదే ఆయనకు కీర్తీనూ.

తన తెలుగుజాతి ఏయే ప్రభావాలవల్ల బాగుపడగలుగుతుందో ఆయా ప్రభావాలన్నిటికీ వీరేశలింగారు గురికావటం జరిగింది. ఇందులో వింత యేమాత్రమూ లేదు. ఎందుచేతనంటే ఏఏ ప్రభావాల వల్ల ఆయన తెలుగుజాతికి పెద్దదిక్కు కాగలిగాడో ఆ ప్రభావాల నన్నిటినీ ఆయన తన రచనల ద్వారా జాతికి అందించాడు. సాధారణంగా ఇతర రచయితలు ఆత్మసంతృప్తికోసమో, కాకతాళీయంగానో కొన్ని ప్రభావాలకు గురిఅయి, ఆ ప్రభావాలను తమ రచనలద్వారా ప్రపంచంమీద రుద్దేస్తారు. కొంతకాలం జరిగినాక అయినా ఈ ప్రభావాలు సంఘానికి ఉపకరించాయా అని అంచనా కట్టుకోరు. తాము ఆ ప్రభావాల నుండి విముక్తులైనప్పటికీ, వాటితో కూడుకున్న తమ రచనలను ఖండించుకోరు. ఇక, సంఘం అవసరాలను బట్టి పనిపెట్టుకుని కొత్త ప్రభావాలను తమమీద తెచ్చిపెట్టుకోవటమనేది ఒక్క వీరేశలింగంగారికే చెల్లిపోయింది.

మొదట్లో వీరేశలింగంగారు అప్పటి కవిపండితుల ప్రభావానికి లోనైనవారై ప్రబంధ, చిత్ర, బంధాది కవిత్వాలు చేశారు. కాని వాటిమీద ఆయనకు త్వరలోనే విసుగుపుట్టింది. కాని యీ రకం కవిత్వం రాయటంవల్ల ఆయన సమకాలికుల దృష్టిలో ఆయనకు సాహిత్య పట్టభద్రత లభించి వుండాలి.

వీరేశలింగంగారి ఇతరరచనల్లో వివిధ ప్రభావాలు కనిపిస్తాయి.

ఇంగ్లీషులో నుంచి షేక్స్పియరు నాటకాలూ, షేక్స్పియరు నాటక కథలూ, గలివర్స్ట్రావెల్స్ మొదలైనగ్రంథాలకుతర్జుమాలున్నాయి. వికర్ ఆఫ్ వేక్ ఫీల్డ్ నవలను అనుసరించి రాజశేఖర చరిత్రమనే నవల ఒకటి ఉన్నది. ఏసు చరిత్రఉన్నది. రసాత్మకంగానూ, సంస్కారదృష్టితోనూ రచించిన ప్రహసనాలున్నాయి. విద్యార్థులఉపయోగం కోసం వాచకపుస్తకాలున్నాయి. సంస్కృతంనుంచి తర్జుమాచేసిన శాకుంతలమూ, రత్నావళీనాటకాలున్నాయి. సంఘాన్ని విమర్శిం చుతూ, ప్రజలకు ఉద్బోధచేస్తూ వ్యాసాలున్నాయి. తర్కమూ శరీరశాస్త్రమూ మొదలైనశాస్త్ర గ్రంథాలున్నాయి. అద్భుతపరిశోధనతోగూడిన కవులచరిత్ర ఉన్నది.

సంఘందృష్టి తనమీదికి తిప్పుకుని తన గొప్పతనం సంఘానికి చెప్పి గొప్పవాడనిపించుకునేటందుకు తాపత్రయపడేవాడు ఇన్నిరకాల రచనలకు పూనుకోడు. కవిత్వం రాసేవాడికి గద్యరాద్దామంటే ఆ కాస్తకీర్తీ పోతుందేమోనని భయం. కథకుడుగా పేరుపడ్డ వాడికి నాటకాలు రాయటమంటే భయం. అటువంటిపరిస్థితిలో వీరేశలింగంగారు కేవలమూ ఆత్మసంతృప్తి కోసమే ఇంత సాహిత్యకృషిచేసి ఉండటం అసంభవం.

ఇందులో మరొక వింతకూడా ఉంది. సంఘకార్యం ఏది నెత్తిన వేసుకున్న వాడుకూడా సాహిత్యం జోలికిరాడు. మన రాజకీయ వేత్తలూ, సంస్కారులూ, నటకులూ, తదితర గౌరవనీయులూ సాధ్యమైనంతవరకు కలంపట్టరు. కీరికాములై ఉండటంచేతనో ఏమో, వారికితాముచేసేపనిమీద ఉండేశ్రద్ధ ప్రయత్న ఫలితాల మీద ఉండదు. తాముచేసేప్రయత్నం సమగ్రంగా ఫలించాలంటే సాహిత్య సహాయం ఉండితీరాలి. వీరేశలింగంగారికి ముందుగాని వెనకగాని సంఘసేవ చేసినవారు తమకు సహకారిగా సాహిత్యం సృష్టించిందిలేదు. అయితే వీరేశలింగంగారుఒక్కరే ఈపనిచేశారు. ఒకవంక వితంతు వివాహాలు చేయిస్తూ తుచ్ఛమూఢాచారా

లను ఎదుర్కొంటూ, సంఘవిద్రోహులను ఎదిరించి శత్రువులను చేసుకుంటూ, అవసరమైనప్పుడల్లా సంఘాన్ని అంతనీ కూడా ఎదిరించి పోరుతూ, జనసామాన్యంలో వివేకమూ విజ్ఞానమూ పెంపొంది తన ఆశయం సిద్ధించగలందులకు, తన సంతానమైన ఆంధ్రజాతి అభివృద్ధికి రాగలందులకు, పత్రికల ద్వారానూ పుస్తకాలద్వారానూ అపారమైన కృషిచేశారు. ఇది అనన్య సామాన్యమైన విషయం.

వీరేశలింగంగారు తనమీద ఉండిన ప్రభావాలు జాతికి ఉపకరించవనితోచినప్పుడు వాటినితోసిపుచ్చటమేగాక, జాతి యొక్క క్షేమంకోసం పనిపెట్టుకుని కొన్ని ప్రభావాలు తెచ్చిపెట్టుకున్నారు. పాతగ్రంధాలను ఉద్ధరించటమూ, కవుల చరిత్రకోసం పరిశోధనలు సాగించటమూ కాక, శాస్త్ర గ్రంథాలు రాయటానికి ఆయన పడిన శ్రమ అతి విచిత్రమైనది. ముఖ్యంగా శరీరశాస్త్రం రాసేటప్పుడాయనకు శరీరభాగాలు ప్రత్యక్షంగా చూసి తెలుసుకుని స్వానుభవంతో రాయాలనే కోర్కె కలిగింది. అందుకుగాను వైద్యవిద్యార్థుల సహాయంతో శవశస్త్రశోధన జరిగేచోటికి వెళ్లి ఆదృశ్యం భరించలేక ఆయన స్పృహతప్పి పడిపోవటం తలుచుకుంటే ఆయన కార్యదీక్ష బోధపడుతుంది. ఆవిధంగానే వాడుకభాషవిషయంకూడా. చివరదశలో గిడుగు రామమూర్తి పంతులుగారి వాదాన్ని ఆమోదించి దానివల్ల ప్రజలకు అధిక లాభంవున్నదని గ్రహించి ఆ ఉద్యమానికికూడా సహాయపడ్డారు. సంఘం సహస్రపాత్తు. దానిప్రతి ఒక్క కాలిచేతా, అవసరమైతే స్వహస్తాలతో, ముందుకు ఒక్క అడుగు వేయించటానికి దీక్షవహించిన మహాపురుషుడు వీరేశలింగం.

వీరేశలింగంగారి రచనలు చూసి ఈనాడు, ఆయన శైలి సరళంగానూ ధారాళంగానూ ఉన్నప్పటికి, అందులో జిగిలేదనీ, కవిగాగాని గద్యకారుడుగాగాని వీరేశలింగంగారు గొప్ప ప్రతిభాసంపన్నుడు కాడనీ, ఆయన శిల్పంలో చెప్పుకోదగ్గ విశిష్టత

లేదనీ అనుకోవటంమనకు చాలా సులభంకావచ్చు. ఈమాట స్వీయ చరిత్రలో ఆయనే చెప్పుకున్నారు. ఒకసారి రాసినది తిరిగి చూడడం గాని తుడుపులూ, హంసపాదులూ పెట్టటంగాని ఆయనకు అలవాటు లేదు. ఆ అలవాటే ఉంటే తన రచన మరింత ఆకర్షవంతంగా ఉండి ఉండునని ఆయనకూ తెలుసును. కాని కేవలమూ ప్రజల నాకర్షించటానికి తనరచనలకు పులికాపు చేస్తూ కూర్చున్నట్టయితే ఆయనకు ఇంత విశాలమైన సాహిత్యకృషి సాధ్యమై ఉండేదికాదు. ఆయన రచనలద్వారా ప్రజలు పొందే ప్రయోజనంకంటె ఆయనకు వచ్చే కీర్తే ఎక్కువగా ఉండేది.

ఒకవేళ వీరేశలింగంగారు తన రచనలను తీర్చిదిద్దటానికి ప్రయత్నించి ఒకటికి పది సార్లు తిరిగి చూసుకున్నప్పటికీ శిల్పదృష్టితో చూస్తే ఆయనరచనలు ఇప్పటిలాగే ఉండేవనుకున్నప్పటికీ వీరేశలింగంగారి ఘనతకు హానికలగదు. ఎందుకంటే సాహిత్యం రచించటంలో ఆయన ఆశయం సాహిత్యపరమైనదికానేకాదు; సంఘపరమైనది సాహిత్యసేవా వ్యాజంతో ఆయన సంఘసేవ సాగించారు. ఈనాటి కవులలాగానూ, కథకుల

సంధి లేదు ♦ ♦ ♦

[39 వ పేజీ నుండి]

“ఏమిటీ వెతుకుతున్నారూ? — ఇదుగో!!”— మోతేమీరం శిరస్సు రామిరెడ్డి పాదాలదగ్గిరికి దొర్లుకొచ్చింది.

నెత్తురుతో తడిసిన పటాకత్తి, రుద్ర చేతిలోనుంచి జారి క్రిందబడ్డది. రుద్ర తూలుకుంటూవచ్చి శిబిరద్వారంలో భర్త పాదాలదగ్గిర పడిపోయింది. జల్లెడ తూట్లుగా సన్నీలు పొడుచుకొని శరీరమంతా రక్తాలోడిపోతోంది

“రు...ద్రా!”— కన్నీటితో గద్గదంగా గొణిగి, భార్య శిరస్సు తొడమీదకు తీసుకోబోయాడు రామిరెడ్డి.

“చచ్చిపోతున్నాను—యీ సైజాం పిశాచం నన్ను నడివీధిలో చీరలొల్చి మానభంగం చేయించాడు...”— వలవలా యేడ్చింది.

రామిరెడ్డి వుద్రిక్తుడై లేచి భార్య జారవిడిచిన పటాకత్తి చేత్తోబుచ్చుకున్నాడు.

“వాణ్ణీ, వాడి కిరాత రాజ్యాన్నీ ఈ పటాకత్తికి బలిబెడతాను— వాడితో మనకిక సంధిలేదు.”

“సంధిలేదు !!!”— చుట్టూవున్న ప్రజా సైన్యం సముద్ర సంఘోషణంగా ఘూర్ణిల్లిపోయింది.

లాగానూ ఆయన తన రచనల ద్వారా తన సమకాలికులకు ఒక అనిర్వచనీయమైన ఆనందం ఇవ్వ లేదనే విషయం ఆయనకేలాటి మచ్చా కాదు గాని, ఈనాటి రచయితలు తమ రచనలద్వారా వీరేశలింగంగారిలాగా సంఘాన్ని ఉత్తేజపరచలేక పోతున్నారనేది వీరికి తప్పక కళంకమే. వీరేశలింగంగారు ఆ రచనలన్నీ చెయ్యకుండా ఉంటే బాగుండేదా, వాటిద్వారా మహోన్నతమైన సాహిత్య శిల్పం ప్రదర్శించివుంటే బాగుండేదా అనేసమస్య బుద్ధిమంతు డెవడికీ కలగదని నా దృఢ విశ్వాసం.

వీరేశలింగంగారిలో ఆధునికతా, వాస్తవికదృష్టి లేదనుకో వద్దు. అది శిల్పంలో లేదు. విషయంలో కుప్పలు తెప్పలుగా ఉన్నది. ఆయన రచించిన రాజశేఖర చరిత్ర తీసుకుంటే అందులోని కథాంశం అభూతకల్పనగా తోచవచ్చు. కాని అందులో పాత్రలన్నీ యథార్థమైనవే; ఆ గ్రంథంలో వీరేశలింగంగారు చేసిన సంఘవిమర్శ ఈనాటికికూడా మన సంఘానికి డొక్కలో బల్లెమే. పాశ్చాత్య సాహిత్య శిల్ప ప్రభావాలకు గురిఅయిన మనకు వీరేశలింగంగారి శిల్పం పాతదిగా కనిపించినంత మాత్రంచేత ఆయన రచనా ధోరణిలోవున్న జాతీయతను మనం విస్మరించరాదు.

ఈనాటికైనా మనం వీరేశలింగంగారి సాహిత్యలక్ష్యాన్ని ఆరాధించగలిగితేనే అభ్యుదయ రచనలు చెయ్యగలుగుతాముగాని అరువు తెచ్చుకున్న శిల్పాలతో వ్యామోహితులమై కూర్చుని ప్రయోజనంలేదు. శిల్పం విషయంలో మనం వీరేశలింగంగారిని దాటి యెంతదూరం పోయినా, ఆయన పెట్టుకున్న లక్ష్యాన్ని ఏమరనంతకాలమూ, నష్టంలేదు కూడానూ.

□

సంస్కృతి

శ్రీ "కరుణశ్రీ"

★

అందుకోండోయ్! అందుకోండోయ్!
అందుకోండోయ్ కాన్క లందుకోండోయ్

కందుకూరి గొప్ప కర్మవీరుండోయ్
వీరేశలింగమోయ్ విప్లవతరంగమోయ్

ఆంధ్రజాతికి మేలుకొల్పు పాడాడోయ్
ఆంధ్రగౌరవ గీతి ఆలపించాడోయ్
అంధవిశ్వాస గాఢాంధకారము బాపి
అభ్యుదయ గతుల ముందడుగు వేశాడోయ్

తెలుగు గడ్డకు మంచి పేరు తెచ్చాడోయ్
తెలుగు బిడ్డకు ముందు చూపు నిచ్చాడోయ్
కులమత ద్వేషాలు కూల్చి వేశాడోయ్
తెలుగు గుండెకు క్రొత్త వెలుగు పోశాడోయ్

దేశమంతటికి సందేశ మైనాడోయ్
లోకానికొక నవా లోక మైనాడోయ్
కందుకూరి గొప్ప కర్మవీరుండోయ్
వీరేశలింగమోయ్ విప్లవ తరంగమోయ్

సంఘ సంస్కార దీక్షాబద్ధకంకణుండోయ్
సాహిత్య నవయుగా స్థాన సంస్థాపనుండోయ్
మహిళామహాభ్యుదయ మహనీయ జీవనుండోయ్
అమరజీవికి పూజ లర్పించుకుందాము
రం...డోయ్! రండో...య్!! రం...డో...య్!!!

'వీర కుంకుమ'

[నాటిక]

శ్రీ సుంకర సత్యనారాయణ

సమయం - తెల్లవారుఝాం

[నల్లగొండ జిల్లాలోని, ఒక పల్లెటూరు. అవూరు నానుకొని గుట్టల వరుసలు, అరణ్యము ఉంటాయి గుట్టలకు దిగువభాగంలో దట్టమైన పొదలుంటాయి. ఒక పొదమీద నాగమల్లితీగె పాకిఉంటుంది. ఆ పొదకు ముందు భాగంలో కొద్దిగా ఖాళీ ప్రదేశం ఇద్దరు గెరిల్లాలు మాట్లాడుకుంటూ ప్రవేశిస్తారు. ముందు నడుస్తున్న గెరిల్లాకు 25 సంవత్సరాల వయస్సు. ఎర్రగా బక్కపల్చగా ఉంటాడు. చదువుకున్నాడు. క్రాపు గాలిలో ఎగురుతూఉంటుంది. చిన్నమీసం, భుజాన రైఫుల్, పేరు మోహనరావు

2 వ గెరిల్లా వయస్సు సం 40లు. దృఢకాయుడు. చామనచాయ. కోరమీసం. భుజాన నాటు తుపాకి. సంస్కారంలేని అతని జుట్టు ఉంగరాలు తిరిగి ఉంటుంది. పేరు భీమన్న. వ్యవసాయకూలీ. ఆ చిక్కని పొదల్లో తిరగటానికి అనువుగా నిక్కరు, బనియన్ తొడుక్కొని ఉంటారు. ఇద్దరి కాళ్లకు చెప్పులుంటాయి.]

మోహ : బందిపోటు దొంగలు!

భీమ : ఎవరు మోహన్ బాబూ ?

మోహ : ఎవరో కాదు, మనమే.

భీమ : మనమా ?

మోహ : అవును మనమే.

భీమ : ఏంది బాబూ, అట్టంటావ్.

మోహ : నేనంటం కాదు భీమన్నా! నెత్తిం కొమ్ములు మొలిచిన పెద్దలన్నారు.

భీమ : ఏం అన్నరు ?

మోహ : కమ్యూనిస్టులు, ఆంధ్రమహాసభ కార్యకర్తలు పగలు పెద్దమనుష్యుల్లాగ నటిస్తారని, రాత్రిళ్లు కొంపలు దోస్తారని.

భీమ : ఎవళ్లు, యీ దేశముకులు, పటేళ్లు పట్వారీలేగా అట్టావాగేది. మనమీద ఏవో నిందలెయ్యందే యీ నాయాళ్లకు పొద్దుపోదు.

మోహ : ఆ నీచులేం వాగినా మనం లెక్క చెయ్యం, చింతపడాల్సిన అవసరమూ లేదు.

భీమ : కాకపోతే నవాబుగూండాలు, పోలీసులు వాగుతున్నరేమొ, అంత

కంటె పిల్లాజెల్లా ఉన్నాడేవడంటుడు, మనల్ని దొంగలని.

మోహ : ఇవి కాంగ్రెసుమంత్రి అన్న మాటలు భీమన్నా! మర్లాక డెవడో అంటే ఈబాధ ఎందుకు ?

భీమ : కాంగ్రెసు మంత్రా ? యిదేం అన్నాయం. ఆరు మనకేదో సాయం జేత్తరంటిరిగా. ఆరికి మనమీద ఇంత కచ్చి యెందుకో ?

మోహ : ఎందుకా, వాళ్లు చెయ్యలేనిపని మనం చేసినందుకు.

భీమ : ఏందది ?

మోహ : ఎన్నికల్లో ఓట్లకోసం జమీందారీ విధానం రద్దుచేస్తామని కబుర్లు చెప్పారు. పేదలకు భూములిస్తామని నమ్మించారు. ప్రజలు నమ్మి తమ ఓట్లు వారికిచ్చారు.

భీమ : మరి ఇప్పుడేం అంటున్నరు ? కుండబోర్లేసిర్రా ?

మోహ : ఆ, మాట్లాడకుండా. అంతట ఆగారా, ఇప్పుడు ధనికుల తరఫున జమీందారుల తరఫున చేరి వాళ్లకు తాళంవేస్తున్నారు. దుర్మార్గులైన ఈ దేశముఖులు, పటేళ్లు, పట్వారీలు కాజేసినభూముల్ని గుంజుకొని ప్రజలకు పంచినందుకు మనల్ని బందిపోటు దొంగ లంటున్నారు. హింసిస్తున్నాం అంటున్నారు.

భీమ : ఇంక ఏంది బాబూ !

మోహ : ఈ దేశముఖులకు, పట్వారీలకు మనంవేసే శిక్షకు 'హింస' అని పేరు పెట్టారు

భీమ : అయితే వారువేసే సిచ్చలు ఎట్టా ఉంటయ్యేంది ?

మోహ : వారిది అహింసా విధానం !

భీమ : అంటే ?

మోహ : అంటే ఏముంది. ఒకర్ని కొట్ట కూడదు. తిట్టకూడదు ! అవతలివాళ్లు ఎంత నీచులైనాసరే, మనం చెయ్యి చేసుకోగూడ దంటారు.

భీమ : అయితే మరేంచెయ్యాలి ? మెళ్లమీద ఎక్కించుకోవాలా ?

మోహ : మనసు కరిగించి వాళ్లను దారికి తీసుకురావాలట.

భీమ : ఏందీ, దేశముఖుల మనుసా ! కరిగేది ? ఈ అడివిలోఉండే ఎలుగ్గొడ్లన్ని, పెద్దపులుల్ని ఒకవిదంగా మచ్చిక చేసుకోవచ్చు, నమ్మొచ్చు. అంతేగాని ఈదొంగనాయాళ్లని, ఎట్టా నమ్ముతవంట ఇంతకీ ఆపెద్దమనుసులు ఎవర్ని కొట్టరా ? తిట్టరా ?

మోహ : వారా ! కొడతారు, తిడతారు. మళ్లీ మాట్లాడితే తుపాకులు కాలుస్తారుకూడ.

భీమ : తుపాకులే ! ఓరిమీద ?

మోహ : . నరుపేదలైన, కూలీలమీద, రైతులమీద. ఇంకెవరిమీద !

భీమ - ఏందీ, నాబోటి పేదోళ్లమీదనా ఈదొరల దూకుడంతా ! బలేగావుంది

మోహ : అదేమిటంటే, ధర్మాన్ని రక్షించటానికి శాంతిని కాపాడటానికి అలా చేశామంటారు. ఇప్పుడు వారు ఏంచేసినా, తప్పులేదులే భీమన్నా.

భీమ : అదెట్టా ?

మోహ: ఎట్లాగా, అధికారం చేతిలో వుంది గనుక, గద్దెలెక్కారు గనుక.

భీము: "ఆరు పేరోళ్ళను కాలిత్తే దర్మ రచ్చన అవుతుందీ! ఈ దేశముఖులు జమిందార్లు చేసే అన్యాయాన్ని మనం ఎదిరిత్తే ఇంసా. బతేనాయం. ఎనకటికి ఒక వూళ్లో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెద్దునాకిందంట.

మోహ: ఈ దేశముఖుల న్యాయం, ధనవంతుల న్యాయం అంతేలే భీమన్నా.

భీమ: అళ్ళ కేం. ఆడకూసోని యెన్ని శీరంగ నీతులైనా చెపుతరు. నాకూతురు కసువు ఊడవటానికి కాత్త యెంకా ముందుగా యెల్లిందని ఈవూరు దేశముఖు నడిబజారులో నాబిడ్డ గుడ్డలూడదీయించి సింత బరికెలతో బాదించిండు. అళ్ళబిడ్డలకి నాబిడ్డకి పట్టిన గతేపడితే అప్పుడు తెలుత్తుంది.

మోహ: తర తరాలనుంచి మన నెత్తిన కూర్చుని అణగ తొక్కుతున్న ఈ దేశముఖుల్ని తరిమి వేస్తున్నాం. నైజాం నవాబుకి రాతక సైన్యాలు పెట్టిన బాధలన్నిటికి తట్టుకుంటున్నాం. కొంపలు తగల బెడితే లెక్క చెయ్యటం లేదు. గ్రామ పంచాయితీలు స్థాపించి దున్నేవాడికే భూమిని పంచుతున్నాం

భీము: అంతే కాదు బాబూ! మా కూలీలకు చేసిన మేలు మాత్రం సిన్నదా! పుట్టిన కాడనుంచి సచ్చేదాకా చేసే ఆ ఎట్టి శాకిరీ పోయింది. ఎనకటి కూలికంటె ఉప్పుడు బోలెడంత కూలి పెరిగింది. అప్పుడు మాకు రైతు ఏమిత్తే కూలిగింజలు కొలిసేవాడు, ఇప్పుడు నవ్వుతా కొలుత్తున్నడు. ఇయ్యాళల ఆర్థూ మేమూ సావుకీబతుకీ ఒకరికొకరు అండాదండగా ఉంటున్నాం.

మోహ: కాబట్టే ఈనాడీ నైజాం సైన్యాలను ఎదిరించ గలుగుతున్నాం. రేపు పటేలు సైన్యాలే కాదు, దేవుడొచ్చినా మనం భూముల్ని వదలం.

భీము: ఏంది, భూముల్నా వదిలేది? బొందిలో ఊపిరుంటే ఇంకా వదలకేం దున్నితే మనం దున్నాలి. లేకపోతే జిల్లేళ్లు మొలిసి అబూములట్టా తగలడి పోవాలి. అంతేగాని ఉ దేశముఖుల్ని మల్లీ సేలల్లో (పొలంలో) కాలు మోపనియ్యకేం. పాణాలు దారబొయ్యాం.

మోహ: అంతే భీమన్నా! పొలాలు పంచి గట్లు పెట్టిననాడు ఊరంతా పండగ జేసుకున్నారు. ఆనాడు వెంకయ్య తాత ఓపిక చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. ఎనభై ఏళ్ల వృద్ధు పంకు పండాడు. లేవదీస్తేగాని లేవలేడు. అలాంటి మనిషికి ఎక్కడనుంచి వచ్చిందో ఆఓపిక కర్రబలంతో చేనుకి నడిచి వచ్చాడు.

భీము: నిజమే బాబూ! ఆదొర వణుకుతున్న చేతుల్తో సేలోంది ఇంతమట్టితీసి నేను సూత్తుండగా కళ్లకద్దుకున్నడు. కాలంకాడు ఆ దొరదగ్గిర ఎట్టాంటి కోడెలుండేయి. ఇప్పుడైతే ఒక్కొకటి వెయ్యి సేసును. అట్టాంటి ఆసామిని నాశనం చేసిండు. ఈ దేశముఖు.

[ఇంతలో ఏదో అలికిడి అవుతుంది. వెంటనే మోహనరావు, భీమన్నలు జాగ్రత్త

పడి, ఆయుధాలు సర్దుకుంటూ అటు చూస్తారు. ఒక స్త్రీ ప్రవేశం. ఆమెకు వయసు 40 సంవత్సరాలుంటుంది. ఎన్నాళ్లో అయింకో నిద్రపోయి ముఖమంతా దోక్కుపోయి ఉంది చీర మడిచి నడికోచి పెట్టుకొంది. ఎఱుపు కొంగు భుజం మీదగా తిప్పి గొంతున దోపింది. నెత్తిమీద గంప, గంపలో జొన్న రొట్టెలు ఉన్నాయి. ఈమెను గెరిల్లాలంతా 'అక్కా' అని పిలుస్తారు. మోహనరావు ఆమె నెత్తిమీద గంప నుంచి దింపుతూ]

మోహ: ఏమిటి అక్కా! నిద్రాహారాలు లేకుండా ఇలా ఎన్నాళ్ళు పని చేస్తావు?

అక్క: ఈ పని చేయటానికే నేను బతికింది నాయనా! లేకపోతే నాకు ఈ లోకంతో పని ఏంటి?

మోహ: ఏమిటి అక్కా! అలా అంటావు?

అక్క: ఏముంది నాయనా! పాతికేళ్ళ కొడుకుని ఆ గూండాల పాల్టన పెట్టాను. పెనిమిటిని ఆ మాయదారి పోలీసులకి బలి ఇచ్చాను. నేను... [ఆమె గొంతుక వణకిపోతుంది. పిడికిలి బిగించి గద్గదకంఠంతో] యీ కసాయి ముండాకొడుకుల్ని నాశనం చేసిన నాడే నాకు నిదర, తిండి.

భీమ: నిజమే అనుకో అక్కా! మనకు కష్టాలకు తరుగేముంది కాని కార్తి తలవాల్సి ఒక్క పనుకన్నా తియ్యంది బతికేటం ఎట్టాగంట! నడిజాందాకా మాకాడే వుంటివి. "నువ్వుపోయి వంట చెయ్యి అక్కా రామిరెడ్డిని తోలుం, అయన వచ్చి మోసుకొస్తడ"ని చెప్పితిమి. ఇంతలో ఏం మల్ల పడిపోయిందని ఉరకొచ్చావు.

అక్క: నేను అక్కడకు పోయి, చేసిన పని ఏముందిలేభీమన్నా. నన్ను చూడగానే పదిమంది ఆడవాళ్లొచ్చారు తలా ఒకపనీ చేశారు. కాసేపట్లో రొట్టెలన్నీ చేసి గంపలో పెట్టారు. "తొందరగా పట్టుకెళ్లు అక్కా! మనవాళ్ళకు ఎంతఆకలి వేస్తావుందో" అన్నారు. పైన నాకుతోడుగా ఒకళ్లిద్దరు వస్తాం అన్నారుకూడా నేనే వద్దన్నా.

[గ్రామంలోని స్త్రీల సంగతులు అక్క చెప్తోంటే విని మోహనరావు ఆనందిస్తూ వుంటాడు.]

మోహ: కోటిరెడ్డి ఎదురుపడలేదా అక్కా?

అక్క: లేదు నాయనా! ఒకసంగతి... పట్వారి ఊరు వదలిపెట్టి నల్లగొండకు పారిపోయిండంట.

మోహ: ఆఁ!

భీమ: ఆఁఏంది. వాణ్ణి నమ్మకద్దని నెత్తిన నోరు పెట్టుకొని మొత్తుకున్న. నామాట ఆలకిత్తేనా.

మోహ: ఎంత దొంగఏడ్పులు ఏడ్చాడు ఆ బ్రాహ్మణ్. 'మీరు ఏగంగలో దూకమంటే, ఆ గంగలో దూకుతా'నన్నాడు. ఐదువేల జరిమానా వేస్తే అప్పటికప్పుడు చెల్లించాడు

భీమ: ఇయ్యాల ఐదువేలు చెల్లించిండు. రేపు మనపీకలు కత్తిరించి, పదివేలు గుంజుతడు. అందుకనే 'ఆ తుట్టిపురుగును నమ్మవద్దుబాబూ' అని మొత్తుకున్న.

[కోటిరెడ్డి ప్రవేశం. వయస్సు 30. సన్నగా వుంటాడు. చెమటలు కారుతూ

వుంటాయి. నిక్కారూ, బరిసెను ధరించాడు].

మోహ : ఏమిటి కోటిరెడ్డి!

కోటి : మన వూరుమీదికి మిలటరీ వస్తా వుందని కబురు వచ్చింది.

భీమ : ఇంకేం. అనుకున్నంతపనీ జరిగింది.

మోహ : (కాస్త ఆలోచించి) కోటిరెడ్డి! అక్కా నీవువెళ్ళి వూరందరిని నిద్ర లేపండి. నడవలేని ముసలివాళ్ళను, పిల్లల్ని, వెంటనే గుట్టలలోకి చేరవేయండి. తప్పెటలు మోగగానే ఒక్క పురుగు మిగలకుండా గుట్టలమీదికి రండి, (ఆఇద్దరు వెళ్లిపోతూవుంటారు.)

మోహ : (అక్కవైపు చూస్తూ) స్త్రీలు కూడా యీవిధంగా రాత్రి పగలు అనకుండ దేశంకోసం పాటుపడుతున్నారు. నైజాం రాక్షసులు గ్రామాలమీదకు వచ్చినప్పుడు పురుషులకంటె ముందునిలచి పోట్లాడుతున్నారు. ఇలాంటి తల్లులకష్టాలు తీరే వరకు మనకు విశ్రాంతిలేదు.

భీమ : ఇట్లాంటి తల్లుల్ని చెరపడుతున్న యీ కీచకులు మునుపట్లుగా కాకుండ వుంటరా!

మోహ : తప్పకుండ నాశన మవుతారు ఒక్క సీతను చెరబట్టినందుకు రావణుడు, నాశనమయ్యాడు. యింతమంది సీతలను హింసించుతూవున్న యీ హంతకులూ, నాశనమవుతారు. ఆ రావణుడుకి తోడ్పడ్డ మైరావణుడు మారణమయ్యాడు నేను వీడికి తోడ్పడే మైరావణులగతి అంతే. సందేహం లేదు. అందాకా ఎందుకు; నిన్న మొన్న ఎన్నో దారుణకృత్యాలు చేసిన హిట్లరు, ముసోలినీలకు ఏగతిపట్టిందో, యీ ద్రోహులందరికి అదేగతిపడుతుంది. ఇవ్వాళ మనం ప్రాణాలొడ్డి గ్రామాన్ని కాపాడుకోవాలి.

భీమ : ఆ పిరికినాయాళ్లు ఈ యేలపాలి మేర దాటిఇవతలికి అడుగుపెడితే గందా!

మోహ : అవును. వాళ్లు సరాసరి వూళ్లోకి కారులు పోనియ్యవచ్చు. బాట రోడ్డులాగ ఉంది అని అనుకొనివుంటారు. మనం తెల్లవార్లు ఆదారికి గండికొట్టిన సంగతి యింకా వాళ్లకు తెలియదు. (ఇంతలో డప్పులమోత వినపడుతుంది) అదిగో, వాళ్లు వచ్చేశారు. పాపం యిప్పుడే మనవాళ్లు ఈ గుట్టలలో తల వాల్చి వుంటారు. పద. అందరినీ లేపి యుద్ధానికి సిద్ధంచెయ్యి. వెళ్లుభీమన్నా (భీమన్న గబా గబా వెళ్లిపోతాడు. మోహన ఊరువైపు చూస్తూవుంటాడు. కోటిరెడ్డి ప్రవేశం)

మోహ : ఎంతమందివుంటారు కోటిరెడ్డి?

కోటి : సిపాయిలు వందకుపైగావుంటారు.

మోహ : గూండాలో?

కోటి : వాళ్లూ ఒకవందవచ్చారు. మన పట్వారినిగూడ వెంటతీసుకువచ్చారు. ఆ గాడిదకొడుకు వాళ్లని వెంట తీసుకొని మన ఇళ్ళన్నీ వేలుబెట్టి చూపుతున్నాడు.

మోహ : అదిగో! మంటలు. కిరాతకులు గ్రామానికి నిప్పుఅంటించారు. ఇవ్వాళ మనచావో వాళ్ళచావో తేలిపోవాలి

(అంటూ ఇద్దరూ వెళ్ళిపోతారు. తుపాకులధ్వని వినపడుతుంది. ఒక ముస్లింసోల్జరు ఒక హిందూగుండా ప్రవేశము.)

సోల్జ: హొక్డా సచ్చార్ యీ ఘగ్లాల్. ంఢల్ చాటున నక్కీ మన్కీ ప్రాణం తీస్తాహుండార్.

గూండా: వాళ్ళంతా కలిసి యెంతమంది వుంటారు? పది, పదిహేను మందికి ఎక్కువవుండరు. ఏంటిఅట్టాజడుస్తావ్ భాయ్. మా దేశముఘనీ, మమ్మల్నీ, మిమ్మల్నీ నాశనం చేస్తారంట, యీ గెరిల్లాలు. అదివేంటో యిప్పుడు తేల్చుకోవాలి.

సోల్జ: ఆరె హాళ్ళ మూలాన మాకీ ఖానా పినా హరాం హైపోయింది. హాళ్కీ రాత్రీ లేదు పగలూ లేదు. హెప్డూ గొడవా సేస్తా హుంటార్.

గూండా: అందుకనేగా, మిమ్మల్ని తీసుకొచ్చింది. సంగంలేని రోజుల్లో పట్టుకొచ్చి తంతే దిక్కుండేదికాదు. ఈ వూళ్లోవాళ్లకి నా పేరు చెబితే చుట్టుపట్టు నాలుగూళ్ళలో పసిపిల్ల పాలు తాగేదికాదు. (కాలుకుంటుతూ కుండడుగు లేస్తాడు)

సోల్జ: హేమిటీ బే కాలూ హెగరా వేస్తావ్? నీకీకూడా దెబ్బ తిన్నావా హేమిటీ?

గూండా: దెబ్బ ఏంటి నడుములు కుదబడితేను.

సోల్జ: అరె, వూళ్లో దాకా దారి హైరోడ్డూ లాగా హుంది అని మాటా సేస్తిరిగా నువ్వూ పట్వారీ?

గూండా: పగలు చూస్తే అంతా బాగానేవుంది రాత్రి యెప్పుడు తవ్వారో గుంట తవ్వి పుల్లలుపేర్చి పైన మట్టిపోశారు యీ గెరిల్లా బద్మాష్‌లు.

సోల్జ: అరె వందామంది మనుసుల్ రోజ్క్రోజ్ తవ్వినా, యింతా గొయ్యా తవ్వలేర్. ఈళ్ళా హొక్కీ రాత్రీ హింతా గొయ్యా హెట్టా తవ్వార్ భై!

గూండా: పల్లెలోని ఆడవాళ్లు, మగవాళ్లు అంతాకలిసి తవ్వివుంటారు.

సోల్జ: అరె బద్మాష్! లారీ హెక్కింది మొదలు క్యాంపుకు ఎల్లిందాకా నమ్కం లేద్. హాడుగడుక్కీ ఏదో హొక్కీ ఖతరా హుంటావుంది. మొన్నా ఆవూళ్లో ముసల్దానీయింట్లో పాలూ తాగినలుగుర్ సచ్చార్. హాదే మొదలు హాళ్ల కొంపల్లో ఏవీ హంట్కోబోయినా కతేజా లట్కా లట్కా కొట్కుంటా హుంది.

గూండా: చచ్చేదానికి ఎట్టయితే ఏముయ్యా! ఆ గెరిల్లాలు మీ సాయిబుల్ని అందర్నీ ఏరిఏరి సంపుతారట, బతకనియ్యరంట.

సోల్జ: బాప్ రే! అదాసంగతి. హందుకే అనే మా కాసిం రజ్వీసాబ్ హట్టా సెప్తా వుండాడ్.

గూండా: ఎట్టా?

సోల్జ: హొక్కొక్క ముస్లింబిడ్డా బతికీ హుండా హిందువుల్కీ వొడ్డీ పెట్టాకుండా వాళ్కీ హందర్కీ నాశనం సెయ్యాలీ సెప్తా హుండాడ్. మల్లీ

సూడా బోతే పట్వారీకి, నీకీ కల్పి మాకీతో డూపంపార్. ఇదీహేమ్టిబే!

గూండా: మేం నవాబుగారి బక్తులం. ఎట్లాగైనా సల్లని ఆ మహారాజుని రచ్చించుకోవాలని సూస్తన్నాం.

సోల్జ: హైతే మీరు మాదీ నవాబ్కీ గులాములు హన్నమాట. అచ్ఛా! అచ్ఛా! [అంటూ గూండా వీపు చరుస్తాడు.]

గూండా: మీరు మేముకలిసి గెరిల్లాలను నాశనంచెయ్యాలి. తెలుసా? అప్పుడు ఈవూళ్లో కోరినంతడబ్బు, కోరినఆడది దొరుకుతుంది. ఏం టను కున్నా వో మజా.

సోల్జ: [షేక్ హాండిచ్చి తుపాకి సర్దుకుంటూ] సెబాస్! హట్లా అయితే ఘెరిల్లాల్కీ హెక్డా వుండాకో నాకీ సూపిచ్చు. హాల్కీ నెత్రూ తాగీ హేస్తాన్. [మీసం దువ్వుతాడు. ఇంతలో పక్కనున్న పొద గలగల లాడుతుంది. ఇద్దరూ ఎగిరిపడతారు గూండా పొదవైపుచూచి]

గూండా: [శ్వాస తీసుకొని] ఇక్కడ ఏమీ లేదు భాయీ! కుందేలుపిల్ల అటు ఉరికింది.

సోల్జ: [నిట్టూర్పు విడచి] హారె అల్లా సాలే! కుందేల్ పిల్లా ఎంత సేసింది బే [పక్కకు చూచి వెంటనే నేలమీద పడుకుని తుపాకిబారు చేస్తాడు.]

గూండా: (అదుర్దాగా) ఏంటి భాయీ, ఏంటది? (అంటూ తన తుపాకిని సర్దుకుంటాడు)

సోల్జ: (గొంతుబిగబట్టి మెల్లగా) హడుగో బే! హడుగో ఘెరిల్లా.

[వెంటనే గూండా బెదురుచూపులతో అటు చూస్తాడు. పకపకా నవ్వుతు ఇవతలికి వస్తాడు.]

గూండా: అది రాతిబండ భయ్యా!

సోల్జ: హారె బేవకూఫ్, అది మన్సికీ మల్లే తెల్లా తెల్లా కన్పడ్తాహుందిగా.

గూండా: గెరిల్లాలు ఆ బండనెత్తినిసున్నం కొట్టారు భాయీ! ఎందుకు అట్లా ఉలిక్కి పడతావు కొంస్త జాగ్రత్తగా సూడు.

సోల్జ: క్యా రే. నాకీ గాభరా పడ్తా హుండాన్ హనుక్నావ్ హేమ్టి? మీదీ హిందువుల్కి మల్లే మాదీ పిర్కి గుండే లేదు బే. ఆ బండ అసల్ ఘెరిల్లా హైతే దెబ్బకీ సచ్చేవాడు.

గూండా: ఓ నీగుండె నిబ్బరం మొన్న యెంకటాపురంలో నేను సూశాగా. ఆయిదేళ్ల పిల్లని బాయెనెట్టుకి గుచ్చి ఎత్తావు. [సోల్జరు సంతోషంగా నవ్వుకుంటూ ఉంటాడు.] తరవాత నువ్వు ఆ పిల్ల తల్లిమీద పడ్డావు. అది నీకు ఎదురు తిరిగింది. నువ్వు తుపాకి తిరగేసి వాలుకు బాది కింద పడగొట్టి దాన్ని సెరిచావు. అప్పుడు అనుకున్నా "ఈ సోల్జరుభాయి మొనగాడు బిడ్డరా" అని [ఇంతలో తెర లోపల తుపాకులు పేల్తాయి. ఇద్దరూ కంగారుపడి అటు చూస్తారు,] అరె భాయీ! మనవాళ్ళూ గెరిల్లా లూ

తుపాకులు కాల్చుకుంటున్నారు. ఆరుగో మనవాళ్లు.

సోల్జ: (తొంగిచూస్తూ) సాలే ఈ ఘెరిల్లాలు హిస్కి–చ్చీ, హిస్కి చ్చీ సంపుత హుండార్. అరె! అరె! మన సిపాయి ఒకోళ్లు దెబ్బ తగిలి బండల్ మీద పడిపోతా హుండాడ్.

గూండా: అరుగో, మనవాడు ఇంకొకడు పడ్డాడు!

సోల్జ: నస్లీ కుంపు ఎక్కి–తగ్గుతా హుంది. (మళ్లీ తుపాకి పేలుత) చల్ రే చల్. బత్కి–హుంటె తర్వాతా సూద్దాం. ఘెరిల్లా హొటూ వస్తా హుండార్ హర్గో. (పారిపోతారు.)

[తెరలోపల 'సచ్చాగ్నా భాయీ' 'అరెఅల్లా' 'జాడోమియా' 'దౌడో' 'హిడ్గావుంటేసస్తాం' అనే కేకలు వినపడతా వుంటాయి. ఇంతలో దెబ్బతిన్న మోహనరావును ఎత్తుకొని భీమన్న వస్తాడు. మోహనరావు పొట్టమీద తుండుబిగించి కట్టి ఉంటుంది. కుడిడొక్క వైపు తుండు రక్తంతో తడిసి వుంటుంది. నెత్తురుచుక్కలు కారుతూ ఉంటాయి. భీమన్న కట్టుబట్టలు రక్తపు మరకలతో నిండిఉంటాయి. చేతులు రక్తమయమై ఉంటాయి. భీమన్న మోహనరావును దింపి తాను కూర్చొని అతని తలను తొడమీదకు తీసుకుంటాడు.]

మోహ: (మూల్గుతూ) భీమన్నా!

భీమ: ఏంది బాబూ?

మోహ: మనదళం.........

భీమ: మన దళమా బాబూ! ఆ దొంగ నాకొడుకుల్ని తరిమితరిమికొడతా వుంది. గుట్ట దిగగొట్టేను.

మోహ: ఊఁ! సరేగాని భీమన్నా! నేను ఒకమాట చెప్తాను వింటావ్?

భీమ: ఏంది బాబూ, చెప్పు.

మోహ: నీవో నేనో ఎవరులేకపోతే మన దళానికి అంత హుషారుగా ఉండదు.

భీమ: నిజమే మరి, ఏం సేద్దాం!

మోహ: నాకు ఎలా ఉందోనని వాళ్ళు ఆందోళనపడుతూ ఉంటారు, నీవు వెళ్ళి నేను బాగానే ఉన్నానని చెప్పు. దళాన్ని ఉత్సాహ పరుచు. ఆదుర్మార్గుల్ని వేటాడి మరీ తరిగిరండి.

భీమ: ఈ తీరుగా ఉండావు నిన్ను వదిలి పెట్టి ఎట్టా ఎల్లను బాబూ! మనవాళ్లలో ఒక్కడు బతికివుండా ఆళ్ళని ముందుకు రానీరు. నేను నిన్ను మన మకాం దగ్గిరికి తీసికెళ్తా. ఆడ మందులపెట్టి వుందిగా. నువ్వు మందుసూపితే నేను కట్టుకడతా.

మోహ: వద్దు. ఇప్పుడు నన్ను అలా తీసుకువెళ్లడంలో నీకుకూడ ప్రమాదం ఉంది, నీవు యెప్పుడూ నా మాట కాదనలా. గెరిల్లావీరుల త్యాగం, సాహసం కనబడేది ఇలాంటి సమయంలోనే.

భీమ: నిజంగా, నువ్వు లేకపోతే మేమంతా ఏడ ఉండేవాళ్ళమో. తూరుపు పడమర తెలవని నాబోటివాళ్లకు కర్రా, కత్తీ పట్టడం నేర్పావ్. పది మందిలో పరువుగా బతికే దారిజూపి ఈ కాడికి తెచ్చినవ్. మాకోసం పడరాని కష్టాలు పడతన్నవ్. అట్టాంటి నిన్ను వదిలిపెట్టి పోలేను బాబూ!

మోహ : (ఉద్రేకంగా) భీమన్నా! నేను మీ దళాధిపతిని. నేను చెప్పినట్లు నడుచుకోటం నీ ధర్మం. వెళ్లు, వెళ్లు [అని గద్దించి అబ్బా! అని మూల్గుతాడు. భీమన్న అతని తలను కింద పెట్టి లేచి నాలుగు అడుగులు వేస్తాడు. మోహన్ మళ్ళీ మూల్గుతాడు. అతని మూల్గుని భీమన్న మళ్లీ మోహన్ వద్దకు వస్తాడు.]

మోహ : (భీమన్ననుచూచి) ఏం? మళ్ళీ వచ్చావేం?

భీమ : పోవాలంటే కాళ్ళు ఆడటం లేదు బాబూ!

మోహ : ఛీ! నిన్ను ఇంతపిరికివాడుఅనుకో లేదు. ఎంతోధైర్యం కలవాడ వను కున్నా. వీరుడవుఅనుకున్నా భీమన్నా!

[ఇంతలో దూరాన తుపాకి మోగు తుంది] అదిగో తుపాకిమోత! ముందు నీ దళాన్ని కాపాడు. నిన్ను నీవు రక్షించుకో లేకపోతే నీవుకూడ దేశద్రోహుల్లో జమే.

భీమ : ఆఁ! బాబూ అంతమాటే! (అంటూ నాగమల్లి పొదక్రిందకు వెళ్ళి భూమిని చదును చేస్తాడు. తరవాత మోహన రావుని రెండు చేతుల్తో ఎత్తుకొని అక్కడకు తీసుకువెళ్ళి పడుకో బెడతాడు.)

మోహ : నా రివాల్వరెక్కడ ఉంది?

భీమ : [తన నిక్కరు జేబులోనుంచి రివా ల్వరు తీస్తాడు] అదిగో బాబూ!

మోహ : నాకుదగ్గరగా పెట్టు. [మోహన్ రావు చెప్పినట్లు భీమన్న చేస్తాడు. తర వాత బయటికివెళ్లి రెండుమండలుతెచ్చి తమ నాయకుడు ఇతరులకు కనపడ కుండా వాటిని అడ్డంపెడతాడు. మోహనరావును మొదటతాను పడుకో బెట్టి చోట రక్తంతో తడిసిన మట్టిని రెండు దోసిళ్ళు అయితే తీ అవతల పోస్తాడు.]

మోహ : భీమన్నా!

భీమ : బాబూ! (అంటూ దగ్గరకు వస్తాడు.)

మోహ : నిన్ను యుద్ధానికి పురికొల్ప టానికి గాను అలా మందలించాను. మరోకవిధంగా అనుకోకు.

భీమ : నిన్నా? ఎంతమాట అన్నావు బాబూ!

మోహ : సెబాస్, వెళ్ళిరా. అదిగో నా రైఫిల్. ఇక నువ్వు దాన్ని ఉప యోగించు. [భీమన్న రైఫుల్ అందు కుంటాడు. మోహన్‌కు శాల్యూట్ చేసి వింగువాకా వెళతాడు. ఒక్క సారి వెనుకకు తిరిగి మోహన్ వైపు చూచి వెళ్ళిపోతాడు.]

[తెరలో నుంచి 'ఊఁ పద. నడ వరా బద్మాష్!' అనే కేకలు వినపడుతూ ఉంటాయి. ముందు వింగులో నుంచి పూర్వపు గూండా, సిపాయీ, మరొక అమీను (సబ్ ఇన్‌స్పెక్టరు) పెడరెక్కలు విరిచికట్టిన కోటిరెడ్డితో ప్రవేశిస్తారు. కోటి రెడ్డివంటినిండా కొరడాదెబ్బలుఉంటాయి. ముఖంమీద చిన్న గాయంపడి రక్తం కారుతూఉంది. నోటి వెంటకూడ రక్తం పడుతూఉంది.)

అమీ : అరె బద్మాష్! బోల్ రే బోల్. నీకీ బత్కాలీ హాన్కూంటే మీాకీ మకాం హైద్దా వుందో నాకీ షేప్పు.

(కోటిరెడ్డి మాట్లాడడు; సిపాయి అటెన్షన్‌గా నుంచోని ఉంటాడు.)

గుం.దా: ఏయ్, కోటిరెడ్డీ! నా మాట విను. అన్యాయంగా ఎందుకు సచ్చిపోతావు? నువ్వు సచ్చిపోతే అల్లందరు నీ ... ల్ని రచ్చిస్తారా? వాళ్లు ఎక్కడ ఉంటారో చెప్పేశావంటే అమీన్‌గారు నీకు భోలెడంత డబ్బు ఇస్తారు. (కోటిరెడ్డి అప్పటికీ మాట్లాడడు, హేళనంగా గూండా వైపు చూస్తూ వుంటాడు.)

అమీ: ఓ ఒక్కడబ్బా హేమ్టి! పొలం హేమ్టి! ఆళ్ళ పట్టీ హియ్యాలిగాని హేదీ కొర్తేహదీ ఇస్తాం. (కోటిరెడ్డి వికటంగా నవ్వుతాడు.) క్యారే పాగల్! హేమ్టి హట్టా నవ్వుతావ్? హాబద్దంమాట సేప్తావుండావ్ హనుక్కున్నావ్? (అంటూ జేబులో చెయ్యి బెట్టినోట్లకట్ట తీస్తూ 'హైతే తీస్కో' నోట్లకట్ట కోటిరెడ్డికి అందించుతాడు.)

కోటి: నాకు కావలిసింది ఈ చిత్తు కాయితాలు కాదు.

అమీ: అచ్చా, హైతే హెమ్టి కావాలో సెప్పు. హిప్డు హిస్తాం.

కోటి: ఈ కట్లు ఊడదీసి ఆ రైఫుల్ నా చేతికి ఇయ్యి అప్పుడు చూపుతా.

అమీ: (కోపంగా) అరే బద్మాష్! (అంటూ కొరడాతో కోటిరెడ్డిని నాలుగు బాదుతాడు. సోల్జరు వైపు చూచి) ఏయ్!

సోల్జ: హుజూర్!

అమీ: హీడ్ని తీసుకుపోయి ఆ చెట్టుకు కట్టు (సోల్జరు కోటిరెడ్డిని పెడబట్టి నెట్టుకొనివెళ్ళి చెట్టుకు కట్టుతూ వుంటాడు)

కోటి: [వికటంగా నవ్వుతూ] నేను డబ్బుకు ఆశపడతా ననుకున్నావు ఈ కుక్కలు. పొలం యిస్తారట పొలం.

సోల్జర్: చుప్ రే బద్మాష్ చుప్. [అంటూ కోటిరెడ్డి నెత్తిమీద రెండు బాదుతాడు. కోటిరెడ్డి ఉద్రేకపడుతూ వుంటాడు. అతనిని చెట్టుకు అంటగట్టటం పూర్తిచేసి సిపాయి తన తుపాకిని అందుకొంటాడు. సిపాయి, గూండా, కోటిరెడ్డికిఎదురుగా నుంచుంటారు. ఇద్దరూ పొదలోని మోహనరావు రివాల్వరు గురికి తిన్నగా అందుబాటులో వుంటారు. వీళ్ళకు కొంచెం దూరంలోవున్న అమీన్ 'ఏక్' అంటాడు. హంతకులిద్దరు కోటిరెడ్డి వైపుకు తుపాకులు బారుచేస్తారు.]

కోటి: వీర తెలంగాణాకు జై!

అమీ: దో. (హంతకులు తమ తుపాకుల గుర్రాలను వెనక్కు లాగుతారు.)

కోటి: వీర తెలంగాణాకు జై!

(అమీన్ "తీన్" అనబోతాడు. ఇంతలో పొదలోనుంచి రివాల్వరు రెండు సార్లు మోగుతుంది. గుండ్లు తగిలి హంతకులిద్దరు నేలమీద బడి గిల గిల తన్నుకుంటూ ఉంటారు. కోటిరెడ్డి "వీర తెలంగాణాకు జై" అని మూడవ సారి గర్జిస్తాడు. అమీన్ కాలికి బుద్ధి చెపుతాడు. తెరలోపల తుపాకి పేల్తుంది. అమీన్ స్టేజీమీదకువచ్చి "అల్లా; అల్లా;" అంటూ కిందపడి తన్నుకొని ప్రాణాలు వదులు

తాను, ముచ్చెమటలతో రక్తపు గుడ్డలతో తుపాకి ఆర్తుల్లో ఉంచుకొని పొంచి అటూ ఇటూ చూస్తూ అదే వాగులో నుంచి భీమన్న ప్రవేశిస్తాడు. కోటిరెడ్డి "భీమన్నా!" అని పిలుస్తాడు. భీమన్న పరుగెత్తుకొచ్చి కోటిరెడ్డి కట్లు ఊడదీస్తాడు. ఇద్దరూ కౌగిలించుకుంటారు. భీమన్న వంటిమీద నెత్తురు మరకలు చూచి అతనికి ఎక్కడ దెబ్బ తగిలిందోనని కోటిరెడ్డి పరీక్ష చేస్తాడు. కోటిరెడ్డి దెబ్బలను భీమన్న పరిశీలిస్తాడు. ఇదంతా ఒక లిప్త కాలంలో జరిగిపోతుంది. తరువాత ఇద్దరూ పొద దగ్గరకు పరుగెత్తుతారు. తమ నాయకుడు యితరులకు కనపడకుండా తాను అడ్డంపెట్టిన మండలలు భీమన్న తీసివేస్తాడు. స్పృహ తప్పియున్న మోహనరావును చూచి కోటిరెడ్డి నిర్విణ్ణుడవుతాడు. తరువాత ఇద్దరు ఆ వీరుణ్ణి బైటికి మోసి తెచ్చి ఒక చోట పచ్చికలో పెడతారు. భీమన్న దాపున పడియున్న ఒక పచ్చని మండను తీసి కోటిరెడ్డికి ఇచ్చి విసరమని సైగ చేస్తాడు. మండను అందుకొని కోటిరెడ్డి విసురుతూ ఉంటాడు. భీమన్న బయటకు పరుగెత్తి ఒక ఆకు దొన్నెతో నీళ్లు తెస్తాడు. ఇద్దరు కలిసి ఆ నీళ్లు మోహనరావునుతాగిస్తారు. మోహనరావు "అబ్బా" అని మెల్లగా మూలుగుతాడు. భీమన్న మోహనరావు తలవైపు కూర్చుని అతని తలను తన ఒడిలోనికి తీసికుంటాడు.)

కోటి: [విచారంగా] ఇట్టా వుండికూడ [చచ్చిపడియున్న సైనికులవైపుకు వేలుచూపుతూ] ఈ దొంగకుక్కల్ని దెబ్బకు పడగొట్టాడు.

భీమ: (ఖిన్నుడై) ఆ లోయలో జరిగిన పోరాటంలో ఆంబోతులంటి నలుగురు సిపాయివాళ్ళను దెబ్బకు [illegible] పడగొట్టాడు. చివరకు తను దెబ్బతిన్నాడు.

కోటి: ఇదివరకు ఈ [illegible] మన్యంలో మనకీ నాలుగు [illegible]లు జరిగినయి. వాటిల్లో ఒక్క గెరిల్లాను దెబ్బతిననియ్యలా, తాను తినలా. చివరికి... [దుఃఖం పొర్లివచ్చి కొంచెం ఆగి] కాని ఇట్టాంటి నాయకుడు మళ్ళీ మనికి దొరకడు భీమన్నా! [అంటూ జలజల కన్నీరు కారుస్తాడు. భీమన్న కూడ కంటతడి పెడతాడు. ఇంతలో మోహనరావు కన్నులు తెరుస్తాడు. కోటిరెడ్డి భీమన్నలు వెంటనే కన్నీరు తుడుచుకుంటారు]

మోహ: [తనకాళ్ళ వైపున నిలబడియున్న కోటిరెడ్డిని చూచి] బాగున్నావా? కోటిరెడ్డీ!

[భీమన్న వైపుకు తలత్రిప్పి] ఆ రాక్షసులు ఏమయ్యారు?

భీమ: పిరికి నాయాళ్లు! మన యిసురికి తట్టుకోలేక లంగిరెక్కి ఉరుకుతున్నారు. [కోటిరెడ్డి మరల మండ వీసుకొని విసురుతూఉంటాడు.]

మోహ: మనవాళ్ళంతా యెక్కడ?

[మూల్గుతాడు]

భీమ: యుద్ధంలో మన చేతికి సిక్కిన 20 తుపాకులు దాని రావటానికి ఎల్లారు. నా తుపాకీ దెబ్బకి పట్వారీ చచ్చాడు బాబూ!

మోహ: [భీమన్న శరీరాన్ని నిమురుతూ] సెబాస్! [మోహనరావుకు శక్తితగ్గి

పోతూ ఉంటుంది. క్షీణస్వరంతో]
అక్క—ఏది?

కోటి : అదిగో వస్తావుంది.

[అక్క ప్రవేశించి పడియున్న మోహనరావును చూస్తుంది. "నాయనా! నాయనా!" అని గుండెలు కొట్టుకొంటూ తల నిమురుతూ కన్నీటితో ఆతని ముఖాన్ని తడుపుతుంది]

మోహ : ఏడుస్తున్నావా? అక్కా!

అక్క : [కన్నీరు తుడుచుకొని] లేదు నాయనా!

మోహ : ఊళ్లో సంగతులు ఏమిటి?

అక్క : ఏముంది నాయనా? మునగాలలో యూనియన్ పోలీసులు మనవాళ్ళని పట్టుకొని నైజాం పోలీసుకి అప్ప జెప్పారు.

మోహ : ఛీ! ద్రోహం! ద్రోహం!!

భీమ : [పొదవైపు వేలు చూపుతూ] ఇట్లా నెత్తురు ఒలకబోసి మనం దేశం కోసం పోట్లాడుతున్నాం. ఆళ్ళు మనకు అన్యాయం సేత్తన్నరు.

[అక్క లేచి పొదదగ్గరకు వెళ్ళి మోహన్ రక్తంతో తడిసి ఎర్రగా ఉన్న ఆ మట్టిని తన పైట కొంగులోకి తీసు కుంటూ ఉంటుంది.]

మోహ : [బిగ్గరగా] ఎవరెంత ద్రోహం చేసినా అంత్యవిజయం మనదే! మనదే! మనదే! [తల వ్రేలాడవేస్తాడు. ప్రాణం పోతుంది. మోహనరావు తలను క్రింద బెట్టి భీమన్న లేచి నుంచుంటాడు. ఇంతలో అక్క కూడ వస్తుంది. ముగ్గురూ మోహనరావుకు శాల్యూట్ చేస్తారు.]

అక్క : [తన పైటకొంగులోని మట్టిని తీసి భీమన్న ముఖాన కోటిరెడ్డిముఖాన పెడుతూ] మన వీరయోధుడు వెళ్ళి పోయాడు. పదండి మన ఊళ్లోకి తీసి కెళ్లి ఊరేగించుకుందాం.

[తన కొంగులోని మట్టిని గుప్పెడు తీసి దానివైపు చూస్తూ, ప్రేక్షకులను చూపిస్తూ]

అక్క : వీరకుంకుమ! ఇది వీరకుంకుమ! దీనిని ముక్కోటి తెలుగు బిడ్డలకు అందిస్తాను. ఇంటింటికి గడపగడపకు అందిస్తాను. వీరయోధులకువీరకుంకుమ, వీరయువతులకు వీరకుంకుమ! వీర కుంకుమ! వీరకుంకుమ! [అని అంటూ ఉంటుంది. కోటిరెడ్డి భీమన్నలు మోహనరావు శవాన్ని పైకి ఎత్తుతూ ఉంటారు.]

***

" రూపాయిల గాలిసోకినప్పుడు దానిముందర బంధుత్వ మును, మిత్రత్వమును సమస్తమును తృణకణముల వలె నెగిరి పోవలసినదేగదా "

—శ్రీ వీరేశలింగం

లేఖలు

1

ఆర్యా!

అభ్యుదయ మార్చినెల సంచిక పూర్తిగా, శ్రద్ధగా, చదివాను. కొన్ని ముఖ్యమైన అభిప్రాయాలు రాస్తాను;

మొదటిది సంపాదకీయం : సంపాదకీయంవలె గాక వ్యాసంలాగ ఉంది. ఎక్కువ విషయాన్ని చెప్పడానికి ప్రయత్నించి, విఫలమై, అతుకులబొంతలా తయారైంది. సంపాదకీయమూ, సెనేటుతీర్మానం ఆమోదించబడాలనే విజ్ఞప్తివిడివిడిగా ప్రకటిస్తే బాగుండేది.

నవ 'సందేశం' ముసలి కంపు కొడుతోంది, ఏమీ బాగాలేదు.

శ్రీ శివయ్యగారి "దేశభక్తి" వ్యాసం అసంపూర్ణంగా పూర్తిఅయింది. తెలుగు సారస్వతంలో ఏదశలో దేశభక్తిప్రాదుర్భవించింది. ఎలా పరిణమించింది? మొదలైన ప్రశ్నలు స్పష్టమైన సమాధానాన్ని పొందలేదు. అనేక దశల్లో అనేక రూపాలు, పొందుతూ వచ్చిన దేశభక్తి నిర్వచనం సారస్వతంలో ఎట్టి ఛాయల్ని పొందుపరచినదీ సమాధానం ఈయబడలేదు. కాకతీయుల యుగంలో మొదటిసారిగా శ్రీనాథుడు జాతీయ భావాన్ని దేశభక్తినీ ప్రబోధించాడు అన్నారు. అయితే ఆ దేశభక్తి ప్రబోధంయొక్క ఫలితం, సమాజంపై అధికారం చేసే ఫ్యూడల్ లార్డు ఉనికినే బలవత్తరం చేస్తుంది. కాబట్టి దేశభక్తి ప్రబోధంయొక్క ఫలితం ప్రజ నుంచి దూరమైందని స్పష్టం! దేశభ బీజాలు సారస్వతంలో ఆ దశలో నా బడ్డాయేకాని పరిపక్వత చెందలేదని అర్థ అందువల్ల వ్యాసాంతానికి వివిధ దశల్లో కవితా పరిణామంలో దేశభక్తి ప్రబోధ ఏ ఏ రూపాలు పొందిందీ విశదీకరించాల్సి అవసరం ఎంతయినా ఉంది.

కాని ఈ వ్యాసం దేశభక్తి పరిణామావస్థల్ని ఎత్తి చూపడంమాని, ఫ్యూడల్ బూర్జువా ప్రతినిధి శ్రీనాథ మహా కవి పెద్ద దేశభక్తుడుగా చూపిస్తుంది. అం గాక "తెలుగు సారస్వతంలో దేశభక్తి" అని పిలచిన ఈ వ్యాసం, ఆ విషయాన్ని శక్తివంతంగా ఎత్తి చూపడంమాని, "శ్రీన ధుని కవిత్వం - దేశభక్తి" అనే వి యంపై వ్రాసినట్టుగా కనిపిస్తుంది

కాబట్టి పేరుకు తగ్గట్టుగా ఈ వ్యాస ఉండాలంటే, దేశభక్తిని తెలుగు సారస తం ఏ దశలో ఎలా నిర్వచించింద చూపుతూ, వర్తమానంలో ఉండవలసి నిర్వచనా రూపాన్ని విశదపర్చడంవ సమగ్రమైన అభిప్రాయం కలుగుతుంది అంతేగాని ఈవిధంగా అసంపూర్ణంగా

వదలిపెట్టి, చివర మాత్రం మార్క్సు వాక్యాన్ని క్రోడీకరించడంవల్ల ఫలితం లేదు. పైగా, ఇలాంటి అసమగ్రమైన వ్యాసాలు, -గతితార్కిక భౌతిక వాద దృక్పథాన్ని వివరిస్తూ ప్రస్తుత కర్తవ్యాన్ని [illegible] ప్రబోధించలేని వ్యాసాలను, అభ్యుదయలో ప్రకటించడం వల్ల తలచిన ఫలితం చేకూరకపోగా తద్భిన్నమైన అభిప్రాయాలకు అవకాశం కలుగుతుంది. 'Man kind sets itself...maturing' అనేవ్యాసాన్ని, వ్యాసంఅంతా వ్రాసుకుపోతూ ఆఖరికి గబీలున జ్ఞాపకంవచ్చి, రచయిత వ్రాశారా అనిపిస్తుంది అంతేగాని ఈ వ్యాసాన్ని కేంద్రంగా (necleus) ఉంచుకొని తెలుగుసారస్వతాన్ని ఎనలైజ్ చేసినట్టు కనిపించదు. ఒకవేళ రచయిత ఉద్దేశం అదేఅయితే, బ్రహ్మాండంగా అపజయం పొందిందని చెప్పకతప్పదు.

శ్రీ వాసిరెడ్డి భాస్కరరావుగారిగేయం అనేక గేయాల ఛాయల్ని ప్రతిఫలిస్తోంది. భావంలోగాని, భావప్రకటనలోనిగాని ఏమీ నూతనత్వం కనిపించడంలేదు.

శ్రీ మాన్సురచించిన 'జన్మహక్కు'— నిజానికి దీన్ని కథ అనడం టెక్నికల్‌గా సరైంది కాకపోవచ్చుగాని, రమ్యంగా, కళాసమన్వితంగా, ఉద్రేక పూరితంగా వున్నరచన అనడంలో సందేహంలేదు. పాఠకుల మేధస్సులకు పని కలిపిస్తుంది.

శ్రీ కుటుంబరావుగారి 'చార్లీచాప్లిన్' కళాజీవితం సంగ్రహంగా వున్నా సమగ్రమైన అభిప్రాయాలను కలిగించడంలో వెనుకాడదు.

'కదలండిక కదనానికి' అనే గేయం మొదటి మూడుపాదాలు తప్పిస్తే గేయమంతా బాగానేవుంది. 'పగిలి రగిలిన కంటి మంటలారా!' వంటి సంబోధనలు హృద్యంగా వున్నాయి.

'నా కవిత' అనే గేయం, "కోటికోట్ల ప్రజలనిష్టం!" అనేవాక్యంతో అంతమైతే ఎంతో బాగుండేది. అలాగాక, తన కవిని గురించి చెప్పుకుంటూన్న కవి, అకస్మాత్తుగా పేదల్నందరినీ పిలిచి 'పదండి' అనడం అసమంజసంగా వుంది.

'నేనెవరిని ?' ఒక మోస్తరుగా వుంది. దుర్గతి గతించు అనేగేయం బాగానేవుంది.

శ్రీ రోణంకి అప్పలస్వామిగారి 'అప్పారావుగారి రచనలు అభ్యుదయం' అనే వ్యాసం ఈ సంచికకే వెలుగిచ్చింది. ఆది ప్రజాకవి శ్రీ అప్పారావుగారి రచనలపై తెలుగుసాహిత్యంలో వచ్చిన విమర్శలన్నిటికన్నా వుత్తమమైనదీ వ్యాసం, అనడం సాహసం కానేరదు. యీ వ్యాసంలో వాడిన చక్కనిభాష మార్గదర్శకంగా వుంది. ఎస్కేపిస్టులకు 'పలాయనవాదులు' అని చేసిన తర్జుమా యెంతో బాగుంది! శ్రీ ఆర్. అప్పలస్వామిగారిచేత యిలాంటి వ్యాసాలను వ్రాయించి ప్రచురిస్తే అభ్యుదయ సార్థకమవుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా "మానవులంతా కలసి ప్రకృతిని జయించే కృషిలోనే కవిత్వం ఆవిర్భవించింది" అనే వాక్యాన్ని న్యూక్లియస్‌గా తీసుకొని, సాహిత్య పరిణామ స్వరూపా

లను వివరించే వ్యాసాలను వ్రాయించడం, ప్రచురించడం, ఎంతైనా అవసరం

శ్రీ సూరిగారు 'ప్రాణప్రతిజ్ఞ' అనే కథను అనువదించడంలో సిద్ధహస్తాన్ని ప్రదర్శించారు.

'జీవితం విలువ' కథాకథనంలో నూతనత్వం చూపలేకపోయింది, కథావస్తువు బాగుంది

అభ్యుదయలో పాఠకుల అభిప్రాయాలను వ్యక్తంచేసే లేఖలు ప్రచురించడం ముదావహం. అయితే లేఖలలోని అభిప్రాయాలకు ప్రతికూలాభిప్రాయాలను వ్యక్తీకరించడానికికూడా అవకాశం ఇవ్వడం మంచిదని మనవిచేస్తాను. శ్రీ కుటుంబరావుగారు లేఖలో కవిత్వం గురించిన అభిప్రాయాలలో కొన్నిటితో నేనేకీభవించలేక పోతున్నాను ప్రత్యేకించి బాగున్న గేయాల లిస్టులో శ్రీ తెన్నేటి సూరిగారి 'పిచ్చికుక్కలు'ను జమకట్టడం విచారింపదగిన విషయం శ్రీ తెన్నేటి సూరిగారి 'పిచ్చికుక్కలు' గేయం, అభ్యుదయలో వచ్చిన సాహిత్య దుర్గంధానికి పరాకాష్ఠ అనాలో లేక పాత సాహిత్య దుర్గంధం తాలూకు అవశేషం అనాలో సందేహం తీరలేదు.

తరువాత కె వి రమణారెడ్డిగారి "ఆడెన్ టెక్నిక్‌ను తెలుగులోకి ప్రవేశపెట్టినందుకు అనిసెట్టికి ధన్యవాదాలు" అన్న అభిప్రాయంతో మాత్రం నేనేకీభవించలేక పోతున్నాను. ది ఆడెన్ యొక్క ప్రత్యేక[illegible]కాదు అనిసెట్టి కొంగ్రొత్తగా ప్రవేశపెట్టిందీ లేదు. ఈ అభిప్రాయం పొరపాటనీ ఇంకా శ్రీ శ్రీ రచనలో వాడిన టెక్నిక్‌కీ ఆడెన్ టెక్నిక్‌కీ సామ్యముందంటే అర్థముంటుందనీ భావిస్తున్నాము

'యుగసంధ్య' అనే గేయం బాగానే ఉంది గేయం మధ్యమధ్య పెట్టిన 'ఇంతలో' వంటి శీర్షికలవల్ల గేయానికి వచ్చిన గొప్పతనం ఏమిటో అర్థం కాదు. పైగా గేయం కుంటికుంటక నడవాల్సి వస్తుంది చుక్కలు పెడితే అంతకన్న బాగుండేదేమో!

'కనువిప్పు' అనే గేయం బాగుంది. కాని 'గుజగుజ మన్నాయి' అనే ప్రయోగం సరైన అర్థాన్ని ఈయటంలేదు

ఏ. సోమసుందర్,
[పిఠాపురం]

2

మొత్తం నేటివరకూ ప్రచురింపబడ్డ అన్నింటిలోనూ మార్చి సంచిక బాగున్నది. ఇందులో అభినందించదగిన శీర్షికలు 'దేశభక్తి', 'జన్మహక్కు' 'జీవితం విలువ' 'కనువిప్పు' అన్నవి.

శ్రీ రోణంకి అప్పలస్వామి గారి వ్యాసంలో గురజాడపై సానుభూతి మోతాదు మీరిందేమో ననుకొంటాను.

'కొమ్మలందున అణగిమణగీ
కవితకోకిల పలుకవలెనోయ్'

అన్న గురజాడకీ —

"దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్ !"

అన్న గురజాడకీ తారతమ్యాన్ని కట్టే వ్యక్తికి —

' చెడ్డైతే నేమీ,
మహాగాంధి
మాలడై తిరిగితే నేమీ '

అన్న బసవరాజు గీతంలోని ఏహ్యాత అర్థం కావాలి. మనిషిలోని చెడను తీసుకోటం ఎట్లాతప్పో అంతా మంచిగా అన్వయించటం అంతే తప్పని నా అభిప్రాయం.

శ్రీ రామకవచంగారి 'నవసందేశం'లో

'ప్రపంచ ప్రజల
విపంచి మీటుచు
మరో ప్రపంచపు
పురోగాములై
మరో ప్రపంచపు
మహాస్రష్టలై
నవసమాజమున
కభిముఖమై
చరిత్రమరచిన
దరిద్రులారా !"

అన్న ధోరణికి విపరీతార్థం వస్తున్నది తెలియకుండా జుగుప్స కలిగించే విధానాన్ని అవలంబించనీయవద్దని, వాటిని సరిచూడమని నాసూచన.

శ్రీ వా. సి రెడ్డి భాస్కరరావుగారు 'జ్వాలాముఖి'లో దాని ఉనృతాన్ని వర్ణించి, వర్ణించి—

'నాజీలతో రాజీపడి
జ్వాలాముఖి శిఖరంపై
చన్నీళ్ళను చల్లబోవు
జడులారా!!

అని పిలుస్తూ 'చలచల్లగ తప్పుకోండి! తప్పుకోండి! తప్పుకోండి! జ్వాలాముఖి వస్తున్నది, అని సలహా చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నది.

రాంషా

[సామర్లకోట]

అభివందనాలు

"శ్రీ వీరేశలింగం పంతులుగారు సాధించ బూనుకున్న ఉత్తమాదర్శాలను ప్రచారంచేస్తున్నందుకు, ఆచరిస్తున్నందుకు ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘానికి సాహృదయపూర్వకాభివందనాలర్పిస్తున్నాను"

యన్. వెంకటరత్నం
కార్యదర్శి, హితకారిణీ సమాజం

Regd. No. M. 4784 ABHYUDAYA - April, '48 As. 6

WRAPPER PRINTED AT UNIVERSAL PRINTERS